శ్రీ


# ఆంధ్రభూమి



సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్రమాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.



సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.



సంపుటము : ౪. ధాతు, వైశాఖము : మే, 1936. సంచిక : ౧౧.


## సంపాదకీయసమాలోచన

కాలుకదిపితే ఆంధ్రుడు ఎక్కేది సదరన్ మహారాష్ట్ర రైలు, లేదా బెంగాల్ నాగపూర్ రైలు; తెల్లవారి లేచినతోడనే ఆంధ్రుడు తినేది అరవ అయ్యరు కాఫీహోటలులోని ఇడ్డెను; కాలక్షేపార్థము ఆంధ్రుడు చదివేది బెంగాలీభాషనుండి దిగుమతినొందిననవల; దీక్షతో ఆంధ్రుడు నేర్చుకొనేది హిందీభాష—చూప దొరకొన్నచో ఇట్టి నిదర్శనములింకను ఎన్నియో చూపవచ్చును. కాని ఆంధ్రులకు పొరుగింటి పుల్లకూరపై ఎంతటి మోజుగలదో తేటతెల్లము చేయుటకు ఇవియే చాలియున్నవి. భారతదేశపు వివిధ జాతులలో ఈ దుర్యోగము ఒక్క ఆంధ్రులకే పట్టినది. కావుననే ఆంధ్రేతరులు వచ్చి ఆంధ్రదేశమున విరివిగ ఆయుర్వేదౌషధముల వ్యాపారములు చేయుచున్నారు, ఆంధ్రమున పత్రికలు స్థాపించి ఆంధ్రహితమును ఏమాత్రము పాటింపక కేవలధనార్జనసూత్రములతో వానిని నిర్వహించుచున్నారు; ఆంధ్రమున పాఠ్యగ్రంథములను వెలువరించి ధనమును దేశాంతరములకు గొనిపోవుచున్నారు. తఱచినకొలది ఇట్టినాచు తెనుగుచెఱువులో ఎంతైన కనిపించును. ఈనాచు తెగులు పోవుట ఎట్లు?

... ... ...

ఆంధ్రదేశమున ఆయుర్వేదౌషధాగారము లెన్నియో ఉన్నవి. ముక్త్యాల ఆర్షరసాయనశాలవారి ఔషధములు, డాక్టర్ జమ్మి వెంకటరమణయ్యగారి లీవర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్, నాగేశ్వరరావుపంతులుగారి అమృతాంజనము, పండిట్ డి. గోపాలాచార్యులుగారి జీవామృతము, ఆచంట లక్ష్మీపతిగారి మందులు, డాక్టర్ కే. యన్. కేసరిగారి లోధ్ర ఆంధ్రుని ఆయుర్వేదవిషయవిజ్ఞానమునకు, వ్యాపారకౌశలమునకు బూరుగొమ్ములైయున్నవి. అయినను బొంబాయినుంచి ఒక మందులకంపెనీ వచ్చి ఆంధ్రదేశమున ఏడాదికి మూడువేల చ్యవనప్రాశలేహ్యపు డబ్బీలను, ఐదువేల ద్రాక్షారిష్టపుబుడ్లను అమ్మకలుగుచున్నది. ఆంధ్రుని ఈ కొనుగోలుశక్తికి సంతోషించవలెనా? స్వదేశాభిమానము లేనందుకు సంతా

పించవలెనా ? ఆంధ్రదేశమధ్యమునగల శతాధికములగు ఆయుర్వేదౌషధకర్మాగారములలో ఒక్కదానియందును ఆంధ్రునకు ... పడు చ్యవనప్రాశము, ద్రాక్షారిష్టము మున్నగునవి లేవా ? లేక పెరటిచెట్టు మందున... నికిరాదా ?

... ... ...

ఆంధ్రేతరులు కొందఱు తెనుగుపత్రికలు స్థాపించి పామరజనాకర్షణమునకుగాను బూతుకథలు, అసభ్య వృత్తాంతములు, నీతిదూరములైన హాస్యవ్యాసములు ప్రచురించి ఆంధ్ర పత్రికాప్రపంచమును పాడొనర్చుచున్నారు. వారు వ్యాపారులగుట ఎట్లో మఱి నాలుగు పత్రికలు వెలబోవుటయే చూతురుకాని పాఠకుల నైతికజీవనము ప్రభ్రష్టమైనను వారికి చింతలేదు. తమజాతివారుకాని పాఠకులు ఎట్లైన వారి కేమి బాధ? పరాయిజాతివాడు వచ్చి తమకొఱకు పత్రికపెట్టు దౌర్భాగ్య... ను మౌనముతో సహించు ఆంధ్రుల నిర్వీర్యతకు ఏమనగలము ?

... ... ...

ఆంధ్రమున పాఠ్యగ్రంథములను వెలువరించు కంపెనీలలో ఆంధ్రేతరములైన వెన్ని యున్నవో ఆంధ్రుడొకసారియైన లెక్కించినాడా ? తెనుగు పుస్తకములను ప్రచురించు ఒక ఇంగ్లీషుకంపెనీ ఆంధ్రబాలశిక్షను ఆంగ్లదేశమున ముద్రించి తెచ్చుచున్నది. ఈదేశమున పుస్తకమును ముద్రించుటకు తెల్లకాగితమును దిగుమతిచేయుచో కస్టమ్సుడ్యూటీ కట్ట వలెను. అగుట ఆంగ్లదేశముననే పుస్తకమును ముద్రించి కాగితములను మడతపెట్టక బేల్లుగా కట్టి వేస్టుపేపరుగా ఈ దేశమునకు దిగుమతిచేసి కస్టమ్సుడ్యూటీని తప్పించుకొనుచున్నది. కాగితముపై కస్టమ్సుడ్యూటీగాకాని, అచ్చుకూర్చువానికి జీతముగాకాని ఈ దేశమునకు ఒకదమ్మిడీనైనను ఈయని ఆకంపెనీయొక్క పుస్తకములు అక్షరాభ్యాసమైనతోడనే మన బాలుర కరముల నలంకరించుచున్నవి. ఇట్లు ఆకంపెనీ ఈతగింజ ఈయకయే తాటిపండు లాగుచున్నది; వంకాయ కొనకయే గుమ్మడికాయ కొసరుతీసికొనుచున్నది. ఈరూపేణా దేశమునుండి ఏటేట ఎంతడబ్బు పోవుచున్నదో ? తనదైనదానినే అభిమానించు ఉద్దేశము జీలకఱ్ఱపాయ యంతైన ఆంధ్రునకుండుచో విదేశమునుండి చిత్తుకాగితములుగా వచ్చిన పత్రములనుండి పుస్తకముపుట్టి తెనుగు చిన్నవాని చిన్నారిచేతుల కెక్కగలదా ? ఆంధ్రుడా ! ఆలోచింపుము.

... ... ...

ఇన్నాళ్లుగ కాంగ్రెస్‌గద్దె ఒక్కసారికూడ ఆంధ్రు డధిరోహించియుండలేదు కావున ఈసారి ఆంధ్రుడొకడు లక్నో కాంగ్రెస్ అధ్యక్షుడు కావలయునని తెనుగువారు కొంత ప్రయత్నముచేసిరి ; తెనుగుపత్రికలు కొన్ని ఈవిషయమై శ్రద్ధపెట్టి ప్రచారముచేసినవి. కాని లాభము లేకపోయినది. మీదు మిక్కిలి గతవత్సరమున కాంగ్రెస్ కార్య నిర్వాహక వర్గమునందుండిన స్థానమైనను ఈవత్సరము ఆంధ్రునకు లేకపోయినది. అధ్యక్షస్థానమునకు ఆశపడినందులకు ఆంధ్రునకు కలిగిన ఫలమా ఇది ? జనాభాను బట్టి హిందూదేశపు వివిధ జాతులలో మనము మూడవవారము. కాని పదునలుగురు సభ్యులుగల కార్యనిర్వాహకవర్గమున మనకు స్థానములేదు. కాంగ్రెస్సులో ఆంధ్రుడు జయిలుకు వెళ్లుటకే.

# సాలెపురుగుల సంభోగమర్మములు

రచయిత:

నమ్మి జగన్నాథము

**ఆడుపురుగు పెద్దది : మగపురుగు చిన్నది.**
**సంభోగము మగపురుగులకు ప్రమాదకరమైనది.**
**సంభోగసమయమున ఆడుపురుగు మగపురుగును తినివేయును.**
**సంతానోత్పత్తితో ఆడుపురుగుకూడ నశించును.**

పట్టులలోనే సాలెపురుగులపిల్లలు గూడ నుత్పత్తియగును. ముందుఋతుపతనమునకు జెందినగ్రుడ్లు చలికాలమంతయు పసుపుముద్దవలె ఈవేడిమిగల పట్టునందుండును. వేసవి ప్రవేశింపగనే గ్రుడ్లు చిదికి పిల్లలగును. మిగిలిన పురుగులవలె 'లార్వల్-స్టేజి' యను మధ్యమదశ దీనికిలేదు. గ్రుడ్లు చిదుకగనే బయలుపడు పిల్లలన్నివిధముల ఆకారమునందు పెద్దలను బోలియుండును.

సాలెపట్టు ఎట్టివిచిత్రమైనదో సాలెపురుగు జీవితయాత్రగూడ అట్టి విచిత్రమైనదిగనే యుండును. పట్టులో పిల్లలు సమష్టికుటుంబదశయందు ఒకవారముగోజులే యుండును. అటుపిమ్మట తల్లియెవరో! పిల్లయెవరో! తిరిగి ఒక్క కుటుంబముగా నవి ఎన్నడును సమావేశముకావు; తిరిగి ఒండొరులను అప్పచెల్లెళ్లుగా, అన్నదమ్ములుగా అవి పోల్చుకొనవు. ఒక్కొక్కపురుగును ఒక్కొక్కగూటిని అల్లుటకు ప్రారంభించును. సాలెపురుగు పట్టున నివాసయోగ్యమయినది ఒక కేంద్రస్థలమే. తక్కిన ఆవరణయంతయు ఆహారమును ఆకర్షించుకొనుటకైన బోను. సాలెపురుగు లొకదానినింకొకటి నిర్దాక్షిణ్యముగా భక్షించును. పెద్దవి చిన్నవానిని, ఆడువి మగవానిని, ఒకే కుటుంబమునకు చెందినను ఈ అన్యోన్యభక్షణము ఆగదు. ఆడువి ఉరవగానుండును. మగవి పీలగానుండును.

సాలెపురుగులకు సెప్టెంబరునెల కంతా ఆ కలిదప్పులు శమించును. అప్పటికి వాని శరీరములు దృఢముగా పెరుగును. అప్పుడవి తమ జాతి నుత్పత్తిచేయు కృత్యమునకు ఆయత్తమగును. వాని జీర్ణకోశములు సంకోచమునొందును. ఆకాళీస్థలమంతయు వృద్ధిపొందిన అండములతోను రేతస్సుతోను నిండిన స్త్రీపురుషసంబంధములగు అంగములచే నావరించుకొనబడును. శుక్లశోణితసంగమమునకుగాను స్త్రీపురుషసమాగమమగును.

సంభోగము పురుషజాతికి ప్రమాదాంశము. ఈ పురుగులకు వసంత వేసవి ఋతువు లనువగునవి. అప్పట్లో తెగించి సమీపించిన ప్రతి మగపురుగును ఆడుది స్వాహాచేయడమే. ఈవిపరీతము మగపురుగునకు ముందు

గానే తెలియును. కాని జీవశాస్త్రవిధి కామము. ఈకామముచే ప్రేరేపింపబడి ప్రాణాపాయమునకైనను మగపురుగులు సిద్ధపడును. సాలెపురుగులలో ఘోరమగు అపాయము లీయిచ్చ ననుసరించి యుండును. అయినను మగపురుగు ఆ అపాయము నెదుర్కొనినసనే తప్ప సాలెపురుగులజాతియే ప్రపంచమున అంతమొందును.

ప్రతి ఆడుపురుగుపట్టుచుట్టు పది పంద్రెండు మ పురుగులు ఏమిచేయుదమాయనియు, ఎప్పుడు ఆడుపురుగును సమీపించుట సమకూడునాయనియు వేచియుండును. కాచుకొని యున్న మగపురుగులన్నిటికిని ఆకర్షించుచున్న రమ్యమగు ఆడుపురుగు కావలయును. కాని అందొకటియే సాహసించి సమీపించును. వెంటనే ఆడుపురుగు రంయ్‌మని వచ్చి దానిపై బడి చంపి పీల్చి పిప్పిజేయును. పాపము! ఈదృశ్యమును తక్కిన మగపురుగులు పరికించుచునేయుండును. ఆపురుగులకు గడగడ వణకుట చేతనగునేని గడగడ వణకునేమోగదా! మిగిలిన బ్రతికియున్న పురుగులు తమ తమ గూళ్ళపై కంగారుగా తిరుగులాడుచుండును. ఎట్టకేలకు ఒకటి తన రేతస్సును స్రవింపజేయును. అది సాలెగూటిపై బడును. అప్పుడది వెనుకకు తిరిగి యింద్రియబిందువును తన ముంగాళ్ళతో తీసి తన నోటియందుంచుకొనును. పిమ్మట కాచుకొనియున్న ఆడుపురుగును సమీపింపబోవును.

ఆడుపురుగు ఆమగపురుగును చూచును. దాని పరిమాణము తనమోజున కెక్కకున్నను, దాని రూపురేఖలు తన ప్రేమదృష్టిని అరికట్టలేకపోయినను దానిని గూడ అది కడతేర్చును. పరిమాణము పెద్దదికాకున్నను, రూపురేఖలు ఆకర్షణీయముగా లేకున్నను మగపురుగులకు తగుధైర్యసాహసములున్నచో ఆడుపురుగు సమ్మతింపవచ్చును. మగ పురుగులు తమ యుద్ధనైపుణ్యమును, ధైర్యసాహసములను ప్రదర్శించుట కిదియే తడవు. తక్కిన మగపురుగులుగూడా ఈసరికి తమ కష్టదశను దాటుచు ఆడుపురుగును పొందగోరుచుండును. అయినను మొదటిది వీనిని ఎదుర్కొని బెదరగొట్టుటగాని అంతమొందించుటగాని చేయవలెను. ఈ సమరమున కడకొకటే మగపురుగు తుదవఱకు నిలిచియుండును. ఆపురుగు అప్పుడు ఆడుపురుగును కోర్టుచేయుటకు ప్రారంభించును. పదిపదునైదు నిముసములు మగపురుగు ఆడుపురుగుచెంత నుండి సరససల్లాపములు కావించును. బహుశా అది దాని ప్రేమను చూఱగొనియుండును. కాని ఆడుపురుగు ఆడుపురుగే. ఆడుజాతికి సహజమగు చలచిత్తమునకు లోగి అది తన అభిప్రాయము నంతలో మార్చుకొనవచ్చును. తనవలలో పడినదికదా యని మగపురుగు పొంగుచుండును. కాని తటాలున ఆడుపురుగు ఈ పది పదునైదు నిముసముల సరససల్లాపములయిన పిమ్మటనుగూడ తన సరసునిమీద పడి హతమార్చి తినివేయును. కొన్ని మగపురుగులు ఈసమయమున ఆడుదాని వీపుమీద కెగిరి కూర్చొని యీప్రమాదమును తప్పించుకొనును.

తుదకు మగపురుగు తన ప్రేమకార్యమును సాధింప సమయమయినదని గ్రహించి తన నోటనున్న రేతస్సుబిందువును తన ప్రియురాలి గర్భాశయముననిడి తత్‌క్షణమే వెనుకకు దుమికి పారిపోయి ప్రాణాపాయమునుండి తప్పించుకొనును. మరియొక 15 నిముషములకు మరల నీపనినేజేసి లోపలికి శుక్లబిందువుల చిమ్మును. ఇట్లు దఫదఫాలుచేసి తన ఇంద్రి

యమునంతటిని వ్యయముచేసికొనును. ఇట్టి సమయములలో మనుష్యులయితే మహానందములో నోలలాడుచుందురుకదా? ఈ సాలెపురుగుల కేమి యీ విపరీతము? ఆహా! సృష్టి వైపరీత్యము!

ఈ గండాలుగడిచి మగపురుగు తన స్వగృహముచేరుకొనిన నదృష్టమే. ఒకవేళ ఈ గండములు గడచినను శీతకాలమారంభము కాగానే తప్పక చచ్చిపోవును. కాని మోహావేశమునకు క్షుద్బాధకు ఆడుసాలెపురుగులలో ఏదో పాయరాని సంబంధ మగపడుచున్నది. అగుటనే లాలనతోకూడిన రతిక్రియలో మునిగియున్నను తన క్రొత్త చెలికానిని ఆడుపురుగు మ్రింగజూచుచునే యుండును. సంభోగానంతరము మగపురుగులు తప్పించుకొనిపోవుట అరుదు. సంభోగానంతరము తుదినిముసమున ఆడుపురుగు తన క్రొత్త చెలికానిని చంపి తినివేయుటకే నిశ్చయించుట తఱచు జరుగుచుండును.

ఆడుది తాను గ్రహించిన రేతస్సును గర్భమున నిలువయుంచుకొని తగుకాలమున శుక్లశోణితములతో పరిపక్వమయిన గ్రుడ్లను పట్టులోబెట్టును. ఇంకను ఏమయిన శుక్లము వృధగా తనగర్భమున నుండిపోయినచో దానిని గ్రుడ్లపై బాగుగా పక్వమునకు వచ్చుట నిశ్చయమగుటకుగాను వానిపై జల్లును. అటుపైని ఆడుపురుగు తన ఉయ్యాలగూడును మూసివేసి దానిని తనశక్తి సామర్థ్యముకొలది సురక్షితముగను, పొడిగను, వేడిగను జేసికొనును. ఇంతయు శీతలమ్మునుండి తప్పించుకొనుటకు. అంతటినుండి తానే కావలి ఉండుచు ఇతర క్రిమి కీటకములను దరికి రాకుండ చేయుచుండును. శీతకాలము విఱుచుకొని వచ్చుచున్నదనియు తాను భద్రముగ నుండగోరుచో తానును తగు రక్షణస్థలమునకు పోవలయుననియు ఆమె గ్రహింపవచ్చును. అయినను ఇప్పుడు దానికి ఆత్మరక్షణవాంఛకంటె మాతృప్రేమ అగ్గలమైయుండును.

ఇటుల క్రమముగా మరియొకతరము సాలెపురుగులు ఉత్పత్తియగును. పట్టులోనుండు గ్రుడ్లలో నుత్పత్తియగుచున్న పిల్లలు తప్ప పెద్దవేవియు హేమంతమునుండి వసంతము వరకును కానరావు. తండ్రి తల్లికెరమైయుండును. లేదా శీతకాలమునబడు మంచున కొరడబారి చచ్చును. తల్లికి శిశుసంరక్షణార్థము తానే విధించుకొన్న బాధ్యత యుండనే యున్నది. ఈబాధ్యతలో అది తన సంతానవాత్సల్యమునకు తానే బలియగుచున్నది. తండ్రి అటులును, తల్లి ఇటులును మరణింపగా. ఇంక మిగిలినవి గ్రుడ్లుమాత్రమే. ఇటుల అవి ఈవింతప్రపంచమున అనాధశిశువులుగా ప్రవేశించును.

సాలెపురుగులు వూయింగును పరిశీలించిన మానవులకు విపరీతముగను వింతగను తోచును. కాని వేలకొలది సంవత్సరములుగ ఇదే వూయింగు పద్ధతి సాలెపురుగుల జాతిని పరంపరగ నిలుపుటకు అవకాశమిచ్చుచున్నది. సాలెపురుగులు పెరిగి పెద్దవియగుటలో చూపు విశేషప్రయత్నమును, కోర్టింగు అవసరమున చూపు హెచ్చు మెలుకువయు, బిడ్డల కనిపెంచుటయందు కనుబఱచు శ్రద్ధాభక్తులును మాతృహృదయమును మానవజాతి అలవఱచుకొనగలిగినచో భవిష్యత్కాలపు స్త్రీపురుషులు ఇప్పటికంటె ఉత్కృష్టమును ఉత్తమమును అగు మానవజాతిని ఉత్పత్తి చేయగలుగుదురు.

—డి. హెచ్. కెల్లర్ గారి ఆంగ్లవ్యాసమునకు అనువాదము.

# యుద్ధములో విషవాయు ప్రయోగము కూడదా?

రచయిత:

జి. వెంకటరావు, బి. ఏ.

ఇటీవల ఇటలీఅబిసీనియా యుద్ధమున ఇటాలియను సైనికులు అబిసీనియనులపై విరివిగ విషవాయువులను, విషధూమములను ప్రయోగించుచున్నందులకు మన పత్రికలన్నియు ఇటలీని నిరసించుచున్నవి. అత్యంతప్రాచీనకాలమునుండియు తాము అనుభవించుచున్న స్వాతంత్ర్యమునకు నేడు భంగము రాకుండుటకై విశ్వప్రయత్నము లొనర్చుచు పోరసల్పుచున్న అబిసీనియనులపట్ల సానుభూతి చూపుటలో ఈపత్రికలవారికి నేను ఇసుమంతయు తీసిపోకున్నను యుద్ధములో విషవాయుప్రయోగము కూడదనువారి వాదముతో నేను ఎంతమాత్రమును ఏకీభవించ లేకుండనున్నాను.

యుద్ధమున విషవాయువులను, విషధూమములను ఉపయోగించుట యుద్ధకౌశలమున క్రొత్త అభివృద్ధి. ఇట్టి క్రొత్త అభివృద్ధి పద్ధతులు కొనిరాబడినపుడెల్ల అవి తీవ్రముగ నిరసింపబడుచునే యుండును; ఆ క్రొత్త అభివృద్ధిపద్ధతుల ప్రయోగములు గాఢముగ తెగడబడుచునే యుండును. ఎంత తీవ్రముగ నిరసింపబడుచుండినను, ఎంత గాఢముగ తెగడబడుచుండినను వాని ప్రయోగము నిషేధింపబడుట మాత్రము కలలోనివార్త. యుద్ధభూమి శక్తిసామర్థ్యములకు పరీక్షాస్థలమే యగును కాని దయాధర్మములకు పంటపొలము కాజాలదు. యుద్ధమున జయమే ప్రధానలక్ష్యము. ఆలక్ష్యసాధనమున కరుణరసమునకుగాని ధర్మజిజ్ఞాసకుగాని ఎంతమాత్రమును చోటులేదు. కాగా యుద్ధమున జయసిద్ధికిగాను విషవాయు, విషధూమ ప్రయోగములను తెగనాడుట యుద్ధనీతిని అవగాహనము చేసికొనకుండుటయే.

ఇంతకును విషవాయు, విషధూమ ప్రయోగము పేల్పులు, కాల్పులు మొదలగువానికంటె ఎక్కువ జననాశకమైనది కాదు. విషవాయువుల విషధూమముల మారణకృత్యములనుండి పరిరక్షించుకొనుటకు మొక్కవోని విరుగుళ్లు ఉన్నవి. కావుననే కేవల విషవాయు, విషధూమ ప్రయోగములతో కావింపబడు యుద్ధము కాల్పులు, పేల్పులు మొదలగు మారణసాధనములతో చేయబడు యుద్ధమంత తీవ్రముగాను అంత నాశనకరముగాను ఉండకుండును. కాగా యుద్ధమున కాల్పులకు, పేల్పులకు ఎట్టి నిషేధము కాని చెప్పక ఒక్క విషవాయు, విషధూమ ప్రయోగమును మాత్రము తెగడుట సంగతముకానిది.

అదియునుగాక విషవాయువులను గూర్చియు, విషధూమములను గూర్చియు మానవులు గావించు పరిశోధనలు వారికి ఇతర విధముల నెంతయో ఉపయోగించును. మిడుతలు, ఇసుళ్లు మొదలగు ఉపద్రవకరములైన వానిని నాశనముచేయుటకును—ఈగలు, దోమలు మొదలగు పీడాకరములైన వానిని సంహరించుటకును—ఇంకను హానికరములైన ఇతర క్రిములను తుదముట్టించుటకును ఈ విషవాయువులు, విషధూమములు మానవునకు బాగుగ ఉపయోగించును. ఇంతటి ఉపయోగకరములైన వానిని కూడనివానిగా త్రోసివైచుట మానవుని విశేషజ్ఞతకు, చిత్తజ్ఞతకు నిదర్శనము కాజాలదు. యుద్ధమున విషవాయువులను విషధూమములను ప్రయోగించుట వానిని దుర్వినియోగ మొనర్చుటయేయని దయాగుణలవదుర్వి

దగ్గులగువారితోబాటు మనమును అంగీకరింతము. అయితే అంతమాత్రమున విషవాయువులను, విష ధూమములను అసలే తెగడుట ఒకానొక దుర్విని యోగముచేతనే ఆదిపదార్థమును విడనాడుట వంటి వెట్టితన మనిపించుకొనును. కీడుమేళ్ళ కలయికలేనిది ఈ ప్రపంచమున ఏమున్నది?

మరియు అనాగరికులతో చేయు యుద్ధమున విష వాయువులును, విషధూమములును ప్రయోగింపబడుట మిక్కిలి ప్రయోజనకారులుగానుండును. ఇటీవల ఇటలీకి అబిసీనియాలో కలుగుచున్న జయమునకు ఈ విషవాయు, విషధూమ ప్రయోగమే ప్రధాన కారణమగుట మఱువరానిది. అనాగరికజాతులన్నియు నాగరికులచే జయింపబడి ప్రపంచమునం దెక్కడను అనాగరకపుపురుగు లేకుండ చేయబడుటకుగాను విషవాయువు, విషధూమములకు మించిన సాధన సామగ్రి మఱియొకటి లేదు. ప్రస్తుతయుద్ధప్రశంసలో నున్న ఒక్క అబిసీనియా దృష్టితోగాక విశాల విశ్వముయొక్క దృష్టితో ఈవిషయమును పరికించినచో ఇందలి ప్రయోజనము స్పష్టమగును.

యుద్ధమున విషవాయు, విషధూమ ప్రయోగమును తెగడుట మితిదప్పిన దయాగుణముచే ప్రేరేపింపబడుటచేతనే గాని యుద్ధనీతియొక్క లోతును బాతును పరిశీలించి దాని అంతర్యమరయుటచే కాదనుట పైకారణములు తేల్చుచున్నవి. కావున ఇక మీదనైన మనపత్రికలవారు అనవసరముగ విష వాయు, విషధూమ ప్రయోగమునుగూర్చిన ప్రతికూల ప్రచారముతో తమ పాఠకుల మనములను కలుషిత మొనర్పకుందురుగాక యని కోరుచున్నాము.


# వజ్రాయుధము

కలరారోగనివారిణి

కడుపునొప్పి,
విరేచనములు,
వాంతులు,
సమస్త అజీర్ణములు
పోగొట్టును.

సీసా 1-కి రు. 0-4-0

సమస్త ఆయుర్వేద ఔషధములు మావద్ద దొరకును. కేటలాగు ఉచితము.

## మృత్యుంజయ ఫార్మసి

గాంధినగర్, బెజవాడ.

# ధన్వంతరినిఘంటువు.

నిఖిలాయుర్వేదసారసర్వస్వవేదియగు ధన్వంతరిచే రచియింపబడిన నిఖిలపదార్థనామగుణ ప్రతిపాదకమైన వైద్యనిఘంటు రత్నము. ఇది సింగరాజు కామాశాస్త్రుల వారిచే ఆంధ్రీకరింపబడినది. గవర్నమెంటు ఇండియన్ మెడికల్‌స్కూలులో ఉపాధ్యాయులుగా నుండిన కీ. శే. ఆయుర్వేదవిశారద ఇ.సో.తి. వేంకటాచార్యులు, ఏ.ఎం.ఎ.సి. వారిచే పరిష్కరింపబడినది.

ప్రతిఒక్కింటికి వెల రూ. 2-8-0.

పిడుగు - వేంకటకృష్ణారావు పంతులు,
2/40. పెద్దినాయని వీధి, మింటుబిల్డింగ్సు,
మదరాసు.

# తెలుగులో కథలు వ్రాసేవారు

రచయిత :

సత్యసాధకుడు

[తెలుగులో కథలువ్రాసేవారు అను శీర్షికతో ఫిబ్రవరిమాసపు ఆంధ్రభూమి సంచికలో కృత్తివాసతీర్థులు అనువారు వ్రాసిన వ్యాసమునకిది జబాబు.]

కృత్తివాసతీర్థులుగారూ! మీవ్యాసము ఫిబ్రవరి "ఆంధ్రభూమి"లో మొదటిసారి మామూలుగాను, రెండవతూరి జవాబువ్రాయవలెనను ఉద్దేశముతోను చదివినాను. మీ విమర్శ, మీపేరుకూడా నాకు చిత్రముగానే కనిపించినవి. మీరు ఇంగ్లీషులో ఉన్న తర్జుమాలు బాల్‌జక్, డాస్టొవెస్కి, గ్రాజియా డెలిడ్డా, మాగ్సిమ్‌గోర్కి, మొపాసా, టాల్‌స్టాయి మొదలైన సుప్రసిద్ధరచయితలకథలు చదివే వుంటారని తలుస్తాను. కథ అక్కడనే పై వారిమధ్య పుట్టినది. మీరు వారిపుస్తకాలు చదివి ఉండకపోయినా సరే, చదివినను కథ ఎట్లుండవలెనో బోధపడక పోయిన కర్మము. అది అట్లుండనిండు.

వివస్త్రయై నాట్యముచేయగా జోహారు.

"కథలో వెర్రిగా ప్రబంధాలను మించిపోయిన పచ్చిశృంగారం అసభ్యతతో, అనాచితితో ఉంటూవున్నది" అని వ్రాశారు. తమరు ఎన్ని ప్రబంధాలు చదివినారు, దేనిలో ఈ "పచ్చిశృంగారం" మీకుశాగ్రబుద్ధికి కనిపించినది? ఓ, తమదృష్టిలో ప్రబంధములు "పచ్చిశృంగారము" తో నిండియున్నవా! సంతోషమే దయచేసి మీరు ఎక్కడైనా దొరికితే, లేక సంపాదించి అయినా, "మైలైఫ్' బై ఇసాడోరా డన్‌కన్ అను పుస్తకముచదవండి. ఈమె (ఇసాడోరా) యూరపులోను, అమెరికాలోను వివస్త్రయై నాట్యముచేయగా మొదటలో మీవంటివారు చాలా అసహ్యించుకొని కళ్లుమూసికొన్నారట. కాని తర్వాత, తర్వాత మతము వేదాంతము మొదలైనవస్తువులు ఆధారముచేసికొని ఆమె నృత్యముసల్పునపుడు గొప్పగొప్ప కవులు, వేదాంతులు సయితము తన్మయానందముపొంది ఆమెకు జోహారులొసంగినారు.

మీరు గ్రీకు, రోమను సుప్రసిద్ధ విగ్రహాలు, అజంతా యెల్లోరా చిత్రాలు గమనించలేదా; ఇదంతా "పచ్చిశృంగార"మేనా మీదృష్టిలో.

లేక ప్రబంధాలను దూషించుట భావకవులరీతి మీకుకూడా "ఫాషను" అయినదా?

ఏమైనా, శృంగారము, "పచ్చిశృంగారము"లకు తేడా తెలుసుకొని మరీ, విమర్శలు వ్రాయబూనుట మంచిది మీరు.

చింతా దీక్షితులు గారికి

కథాప్రపంచములో ఎట్టిస్థానమును లేదు.

దీక్షితులు : తర్వాత చింతా దీక్షితులు

గారు "ఉత్తమశ్రేణికి చెందినవారు" అని వ్రాసినారు. ఎట్లుచెందెదరో నాకు బోధపడ లేదు. నాదృష్టిలో ఆయన పిల్లలకు పుస్తకములు వ్రాయుటకు, పాఠములు చెప్పుటకు తప్ప మరెందుకు పనికిరారనీ, అప్పుడప్పుడు ఏ హరినాథబాబా జీవితమో, "పరివర్తనము"మీద పుస్తకమో వ్రాయుటకు మాత్రము అర్హులనీ ఎంచెదను. ఈమధ్య జ్వాలలో నీలకంఠంకథలు వ్రాసిన శంకరశాస్త్రిగారు వారి "అన్నగారు" అయిన దీక్షితులుగారిని "కథకచక్రవర్తి" అని పొగడుకొనుటలో కొంత అర్థమున్నది. మీరు తెలుగుకథలను విమర్శచేయ దలంచుకొని ఆయన కంతస్థానమిచ్చుట—ఏమనవలెనో ! లేక మీరు శాస్త్రిగారికిగాని దీక్షితమహాశయునకుగాని బందుగులా? అదీ, ఇదీ కాకపోతే "గొడ్డు లేనివూళ్లో గొడ్డుగేదె మహాలక్ష్మి" అంటారా ? మనవారికి ఒకరినొకరు పొగడుకొనుట బాగా అలవాటులాగు కనిపించుచున్నది. ఏమైనను దీక్షితులుగారికి కథాప్రపంచములో ఎట్టిస్థానమును లేదని నాదృఢమైన నమ్మిక.

మొక్కపాటి : ఈయన "బారిష్టరు" చక్కని గ్రంథము. వీరిరచనలన్నియు మొత్తముమీద మెఱుపులవంటి భావములు కలిగి ఉంటవి. ఇంగ్లీషులో జరోమ్, వుడ్ హౌస్, జాకబ్సును వీరి రచనలు తలపిస్తూ ఉంటవి.

వెంకటచలంగారి కథలు దొంగరకం ఫొటో కథలు.

వెంకటచలం : ఈయన "వకీలు" అని మీరు తప్పు అభిప్రాయములో ఉన్నారు. వెంకటచలంగారు బడిపంతులు. అయినను ఈయన ఎడ్యుకేషనల్ రూల్సుకు వ్యతిరేకముగా గవర్నమెంటు అనుమతిలేకుండా "అసభ్యమైన" పుస్తకాలు వ్రాస్తున్నారు. ఈయన రచనలు మేలుకంటె హాని ఎక్కువ చేస్తున్నవి సంఘానికి. ఇటువంటివారంతా "సంఘం మరమ్మతుకోసం" పుస్తకాలు వ్రాయుచున్నారు అంటే అంతకన్నా తెలివి తక్కువ మాట ఉండదు. ఈయన "శశిరేఖ" చచ్చు పుస్తకము ; మీకు గుణా అవగుణములు బాగా తెలియవలెనంటే రోమెన్ రోలెండుగారి ఎంఛాంటెడ్ సోల్ చదివితే సద్గ్రంథమునకును, నీచపు "శశిరేఖ"కును తేడా తెలియకలదు. ఎంఛాంటెడ్ సోల్ ఎందుకు పోల్చినానంటే "శశిరేఖ"తో కొన్ని విషయాలలో బాహ్యదృష్టికి పోల్చతగిన 'ఎన్నెట్టి' అనేవ్యక్తిని రోలెండు సృష్టించియున్నాడు కనుక. వెంకటచలంగారికథలు మొపాసా కథలకు అనుకరణాలు, దొంగరకం "ఫోటో" కథలు. ఈయన "దైవమిచ్చిన భార్య" పేరుకూడా ఈయనసొంతముకాదు, సర్ హాల్ కెయిన్ గారి "ది ఉమన్ దౌగేవెస్టు మి" అనేపేరుకు తెనుగు. ఆపుస్తకములోని వస్తువు హెచ్. జి. వెల్సుగారి ఫాషనేట్ ఫ్రెండ్సు లోనిది.

ఈనడుమ నేను డి. హెచ్. లారెన్సు అనే వెంకటచలంగారివంటి ఇంగ్లీషురచయిత పుస్తకమొకటి చదువుచుండ అందు "ఆమె ఇంటిచుట్టు అతడు 'ఆడకుక్క వెంట మగకుక్కవలె' ఆత్రముతో తిరుగుచున్నాడు" అని ఉంది. అయితే, అటువంటి చచ్చువ్రాతలు వ్రాయుటచేతనే లారెన్సును ఇంగ్లండునుండి తరిమివేశారు. కాని వెంకటచలంగారిని తరిమేవారు ఏరి? లోకమంతటిలో గొప్పవాడు అనుకుంటూవున్న బెర్నార్డుషా (ఏకపత్నీవ్రతుడు, శాఖాహారి) వంటివాడు మాన్ అండ్ సూపర్ మాన్ వ్రాశాడు అంటే వెంకటచలంగారివంటి "నీతి"లేని మనిషి పుస్తకాలు

స్తున్నాడంటేను తేడా లేదూ! ఏదో వెంకటచలంగారు ఇంద్రుడని చంద్రుడని పొగిడే దానికంటే వారి కథలు, పుస్తకాలు కొంచెంగా పరీక్షచేస్తే గుట్టుకాస్త బయట పడుతుంది.

మునిమాణిక్యం: ఈయన కథలు సాంసారిక కథలు: ముచ్చటగా ఉన్నమాట నిజమే కాని, స్వీయచరిత్ర ఎక్కువగా నింపివేస్తున్నాడేమో అని భయము వేస్తూవుంటుంది.

శ్రీపాదవారికి ఇంగ్లీషువచ్చిఉన్నట్లయితే.

శ్రీపాద: ఈయనకు మీరేదో బోధచేయ ప్రయత్నించినారు కాని, ఆబోధ అంత కారణ యుక్తముగాను, ఉండవలసినరీతిగాను లేదు. వీరి మురిపెముగూర్చు కథలలోని గొప్పతనం ముందుముందుతరాలువారు బాగా గ్రహించగలరేమో అని ఆశ. ఇంగ్లీషురాని లోపము వీరికథలలో కనిపించేమాట నిజమేకాని, శ్రీపాదవారికి ఇంగ్లీషువచ్చిఉన్నట్లయితే, అసలు పాడవునేమో అనికూడా భయము కలుగుతూ ఉంటుంది. వీరి "చతురంగం" కథ మొదలైనవి కథ ఎట్లుండవలెనో అచ్చముగా అట్లున్నవి.

శివరామశాస్త్రి: వీరి రచనలు సెలయేళ్ళవలె స్వచ్ఛముగా మందగమనముతో నడుస్తవి. ఆత్మశుద్ధి ఈయన వ్రాతలలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. కథాలోకము ~ ఈయనకెట్టి స్థానము లభించునో ఇప్పుడప్పుడే చెప్పుట కష్టమైన పని.

అయితే చక్కనికథలువ్రాసే కొడవకంటి వారినిగూర్చి మీరు వదిలివేశినారేమి?

ఏమైనను వాఙ్మయములో మనవారు ఎంతవరకు అభివృద్ధి పొందినారు? మనము ఇంగ్లీషువారు వాఙ్మయవిషయమున విక్టోరియన్ యేజ్‌లో ఉన్నట్లయినా ఉన్నామా' లేక ఏజ్ ఆఫ్ రొమాంటిసిజమ్‌లో వున్నటులకూడా లేమా! అని భయము వేస్తూ వుంటుంది. పోనీ మనబెంగాలీ సోదరులు ఇప్పుడున్న స్థితిలోనైనా ఉన్నామా! మన పెద్ద మనుష్యులకు అహంభావము ఎక్కువ, అదీ, శక్తి, లేకపోతే ఈర్ష్య—మనము ఎంత వెనుకబడివున్నదీ మనకు తెలియదూ!

నీలకంఠం కథలు

'పొరుగింటిఆవిడమీది చూపుతూపులు'

ఏది, ఒక్క వజ్రపుతునుకవంటి స్వతంత్ర గ్రంథము—ఒక డేవిడ్ కాపర్‌ఫీల్డు వంటి ఉత్తమగ్రంథము—మనలో ఈనడుమ పుట్టినది? శంకరశాస్త్రిగారివంటివారు ఆశరత్తు బాబునుండి తర్జుమాలు చేయకపోతే స్వతంత్రంగా వ్రాయ· ప్రయత్నించకూడదూ! అవునవును—ప్రయత్నం చేయకచేయకచేస్తే నీలకంఠంకథలువంటివి పొరుగింటి ఆవిడమీది చూపుతూపులతో బయలుదేరుతవి. వెంకట పార్వతీశ్వరకవులున్నారు. ఇంక ఎందరో వున్నారు — కాని ఏమిప్రయోజనము—ఏది ఒక్క స్వతంత్రగ్రంథము—అయితే ఏచాటునో మాటునో ఉండి, బురదలోనుండి వచ్చిన తామరపువ్వులాగు, మబ్బులలోనుండి కొండల చాటున మెరిసే చందమామలాగు వెలసిన "మాలపల్లె"—ఉన్నవ లక్ష్మీనారాయణగారు ధన్యులు. ఇంకా విశ్వనాథ, వేదుల, చిలకమర్తి, పానుగంటి, బసవరాజు, నండూరి మొదలైన కవులు, రచయితలు మనలో లేక పోలేదు.

అయితే ఇతర భాషలోకి తర్జుమాచేయుటకు అర్హతగల పుస్తకం మనలో ఒక్కటి మచ్చుకైనా ఉందీ?

ఇంకెపుడు తెనుగువారికి ముక్తి!

# తద్దినాలవిషయంలో కోరతగ్గ కొన్ని మార్పులు

(కేవలము వినోదముకొఱకు)

రచయిత:

ఇందుకూరి సత్యనారాయణరాజు

విదేశాల్లో వున్న విద్యార్థుల—ఉద్యోగరీత్యా ఊపిరిసెలపకుండా కొట్టుకొనే కొమర ప్రాయపు ఉద్యోగస్థుల—పరీక్షల తయారీ హడావిడిలోఉండి ఒక్క సిగరెట్టుదమ్మైనా సేవించడాన్కి తీరికలేక చదువులు పేల్చేసేటటువంటి కాలేజీ విద్యార్థుల—కూటసాక్ష్యాలు చెప్పి కొంపలు తీస్తూ కోర్టులు అనేకులటల కరాల్ని చుంబిస్తూ ఉండే ఘరానామనుష్యుల—ఉపయోగార్థం యీవ్యాసం వ్రాస్తున్నాము. బహువచన ప్రయోగానికి క్షమించండి.

తద్దినాలవిషయంలో కోరతగ్గమార్పుల్లో మొదటిది తద్దినం ఒకేనిర్ణీతదినమున జరపాలని నియామకంలేకుండా ఏదినానికైనా సరే మార్చుకోగలగడం... మొట్టమొదట మనం తద్దినశబ్దంయొక్క అర్థం విచారిద్దాం. తత్ +దినము = తద్దినము అంటే ఆరోజని అర్థం. ఆరోజంటే మృతదినంఅని. అనగా రమారమి మృతులైనవారిని స్మరించేదినమన్నమాట. స్మరించడానికి ఏర్పడ్డదినం కాబట్టి దీన్ని మన యిష్టంవచ్చినప్పటికిన్నీ, మనకు వీలుచిక్కినప్పటికిన్నీ, తక్కువరేటుకు భోక్తలు దొరికినప్పటికిన్నీ, సెలవు సుళువుగా దొరికిన రోజునకున్నూ, పైసాచేతుల్లో మెదిలేరోజునకున్నూ మార్చుకోవడంలో ఏమిన్నీ ఆక్షేపణ ఉండకూడదు. ‘అయ్యో! ఇదేమిటయ్యా! సంవత్సరంలోపల మనయిష్టంవచ్చినప్పుడు తద్దినం పెట్టడం ఏమిటి? మనకు సంవత్సరం అయితే దేవమానంప్రకారం పితృదేవతలకు ఒకరోజవుతుంది. అందుచే మనం సంవత్సరానికి ఒకసారి తద్దినంపెట్టుచున్నామంటే వాళ్ళకి రోజూ ముట్టుతోంది అన్నమాట. అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయ్’ అని ఒకరు మొర్రపెట్టుకొంటున్నారు. వారు చెప్పినప్రకారంకూడా చూస్తే సంవత్సరంలో ఎప్పుడో అప్పుడు ముట్టుతున్నదన్నమాట. కాకపోతే సరిగ్గా ఆరోజుకు ఆవేళకు అందకపోవచ్చు. ఈమాత్రందాన్కి కొంచెం శాంతంవుంచి పితృదేవతలు తద్దినం పెట్టేవాళ్ళయొక్క యీలోపాల్ని ఉపేక్ష చేయాలి. నిజంగా ఆలోచిస్తే పితృదేవతల్కి అసలు యీతద్దినాలు సుతలాము అనవసరమనిన్నీ, అంతగా వారివిషయమై తగినంత శ్రద్ధాళువులుగాలేరనిన్నీ, వీట్ని పెట్టితే యించుక సంతుష్టి చెందుతారనిన్నీ యీమధ్య ఒక స్పిరిచ్యువలిస్టు ఒక పితృదేవతని ఆహ్వానం చేస్తే చెప్పాడు. కాబట్టి ఈమార్పు కొని రావడం మంచిది.

ఇక రెండోమార్పు. రేపు తద్దినం అనగానే పెద్దలు ఏమిటో ఏకభుక్తంఅంటూ సాయంకాలం భోజనంచేయకూడదని శాసిం

చారు. ఆశాసనాన్ని యిప్పుడు ధిక్కరించాలి. భోజనంలేకపోవడంచేత మరునాడు చేయబోయే పితృకార్యంలో కొంచెం నీరసం పొందవచ్చు. కొండొక సమాయాల్లో నీరసం అధికమై వైద్యసహాయాన్కి పరుగెత్తవలసివస్తుందేమో! కాన రాత్రి కొంచెం లఘువుగా నీరుల్లిపాయ మసాలాపెట్టిన బంగాళాదుంపకూర మొదలగు తేలిక పదార్థాలతో భోజనం తెమిల్చేస్తే మంచిదిలా తోస్తోంది.

కోరతగ్గ మరోమార్పు. అపరాహ్ణం దాటితేగాని తద్దినం పెట్టకూడదని మనశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఎందుచేత అట్లా అప్పుడే [illegible]గాలో తెలియకుండావుంది. ఆఫీసులకు, స్కూళ్ళకు, కోర్టులకు టైముదాటిపోకుండా పదిగంటలు కాకుండానే తద్దినంవుంచితే మహాదివ్యంగా వుండదండీ? పై ఆఫీసర్ల చిర్రుబుర్లు, న్యాయాధికార్ల కోపానలాలు, మేస్టర్లు నిలబెట్టడాలు యిత్యాదులు మందునకైనావుండవు. భోక్తల్కికూడా కళ్లు తిరుగవు. చక్కగా ఆసనశుద్ధిగా కూర్చుని సాపడవచ్చు—చేసినదంతా. తద్దినంపెట్టేఆయన కూడా, ఆట్టే యిబ్బందిపడక్కరలేకుండ చప్పున తేలిపోతుంది. ఒకవేళ అంతవరకైనా ఆయనగారు ఉండలేకపోతే ప్రొద్దున్నే యింత ఘనపదార్థమో, ద్రవపదార్థమో కుక్షిలో పారవేస్తే మరీమంచిది. ఈమాత్రం లైసెన్సు తప్పక ఆయనకు యివ్వావలె. మరిన్నీ సాధ్యమైనంతత్వరలో తద్దినపుతంతు ముగించి, ముఖ్యవిషయమైన భోజనం సకాలంలో కానివ్వడం సర్వోత్కృష్టం. ఈమార్పు అత్యావసరమైంది.

తద్దినంలో మాటిమాటికి యజ్ఞోపవీతాన్ని అటుత్రిప్పమంటూ యిటుత్రిప్పమంటూ ఏవో అర్థంతెలియని మంత్రాల్ని ఏకరువుపెట్టుతాడు విప్రమహాశయుడు. అట్లా పదే, పదే త్రిప్పడంచే కొంతశక్తి వృథా అవుతింది. అట్లా చేయకుండావుండడం క్షేమకరమైన విషయంకాదా?

నానాచోట్ల తిరిగివచ్చే భోక్తల పాదపద్మాల్ని ప్రక్షాళనచేసి ఆపవిత్రోదకాన్ని శిరస్సుపై జల్లుకోవడం ఆరోగ్యసూత్రాల్కి వ్యతిరేకం. మీరు భోక్తల్కి మర్యాదచూపడాన్కి స్వయంగా కాళ్లుకడుగుతున్నారుగా! పై పెచ్చు తలమీద ఆనీటిని చల్లుకోవడ మెందుకు? అని పృచ్ఛిస్తాడు మామిత్రుడు. పూర్వకాలంలో పవిత్రస్థలాలు మెట్టిన ఆపూజ్యుల పాదోదకాన్ని జల్లుకొంటే జల్లుకొన్నారు కాని, ఈకాలంలో అట్లాచేయడం వట్టి శుద్ధ తెలివిలేమిగా కనబడుతోంది. కాబట్టి ఈ ఆచారం ఇప్పుడు మారాలి.

తద్దినపుతంతు మధ్య మూడు చిన్న బియ్యపు బంతుల్ని పాలతోతడిపి చేస్తారు—అహో! పిండాలుకాబోలు! వాట్ని మనవాళ్లు సర్వసాధారణంగా, రేవుల్లో కలుపుతూవుంటారు. అది ఆరోగ్యనియమావళికి ఎంతభిన్నం! నీటిని నానాచెత్తకలిపి పాడుచేస్తే కలరా మొదలగు వ్యాధులు బయలు దేరవూ? కాన మన పూర్వులు చెప్పిన రెండవపక్కి (అగ్నిలోవేయడం) వుందే అది చాలామంచిది. మరియు కొంతకాలాన్ని, ప్రయాసాన్ని (చెరువుపగయరాలవద్దకు నడవక్కరలేకుండా) రక్షిస్తుంది.

మనవాళ్లు తద్దినాలలో అనవసరంగా భోజనంనిమిత్తార్థమై చాలాడబ్బు వ్యయం చేస్తారు. అధమం నాలుగుపచ్చళ్ళనీ, నాలుగు కూరలనీ యివనీ అవనీ అధికంగా చేస్తారు. మీదు మిక్కిలి గారెలు తప్పక చేయవలసినదేనా? డజన్లుకొలదీ అప్పడాల్లాగ చప్పరించే

మేటిభోక్తలు వస్తారుకాబట్టి కొంచెం జాస్తిగానే చేయవలసి వస్తుంది. లేకపోతే గిరీశం అన్నట్టు ఆబోరు దక్కదు. మనదేశం తల ఒక్కంటికి రోజునకు ఒకఅణా ఏడుపైసలు రాబడివచ్చే దరిద్రపుస్థితిలో వుంటే, మనం యీతద్దినాల్కి భోజనంకోసం యింతడబ్బు పాడుచేయటం చాలాదారుణం. శ్రీగాంధీగారు ప్రతి శాంతిసైనికుణ్ణి వానివానికయ్యే ఖర్చు రోజుకు 0-5-0 కంటె హెచ్చుకాకూడదన్నారు. మనంకూడా డబ్బు అమితంగా యిచ్చువచ్చినట్లు ఇట్లాంటి కార్యాలకోరకై వినియోగించడం వివేకశూన్యమైనపని. మనముకూడ యీభయదజీవితసంగ్రామంలో శాంతిసైనికులమే. అందుచే మేంమనవిచేసేదేమిటంటే యీ డి.పి. భోజనాల్కి హెచ్చు బ్బు వెచ్చించడం పాడిగాదని.' బ్రాహ్మణేతురలలో యిచ్చేటట్టు స్వయంపాకాన్ని తగ్గింపు మోతాదులో యివ్వడం శ్రేష్ఠం. అట్లా అని అపాత్రదానం చేస్తే అన్యాయం. తద్దినంరోజున యింట్లోవాళ్ళే (మహాసన్నిహితులైతే ఒకరిద్దరు పిల్లలతో) హాయిగ మామూలుకంటె, ఒకటో రెండో కూరలు చేసుకొని, గతించిన ఆఘనుని స్మరించుకొని తినడం చాలామంచిపని. స్వర్గీయుడైన ఆ మహాభాగునకు ఏవస్తువులయితే యిష్టమో, పాయసంఅయితే పాయసం, ఆవళ్ళయితే ఆ వళ్ళు, ఉల్లిపాయపకోడీలయితే అవి, ఆసమయాన్న వాడడం శ్రేష్ఠమైనపని. భోజనాల్కి అయిన డబ్బుకు వడ్డీయా అన్నట్టు గట్టిగా పొట్టవిచ్చేటట్టు మేపి భోక్తదక్షిణ అంటూ ఏ పావలో, బేడో చేతిలోపెట్టడం ఒక దురలవాటు. భోక్తల్లో నూటికి తొంభైతొమ్మిదిమంది సదరుధనాన్ని దుర్వినియోగం చేస్తారు. రెండు ఎలిఫెంటు సిగరెట్టు పెట్టెలనో, లేక వారంరోజులకు సరిపోయే పణ్ణు గంచెట్టి నశ్యమో, లేక సాయంకాలం మద్రాసు అయ్యరు హోటల్లో రెండు దోసెలో కొనుటకు వినియోగిస్తారు. అందుచే ఆ దక్షిణ యివ్వడం రద్దుచేసి, కానీ ఖరీదుచేసే కిళ్ళీ (అజీర్ణంచేయకుండా వుండటానికి) యివ్వడం యోగ్యమైనపని.

విదేశాల్లోవున్న విద్యార్థులు తద్దినాలు పెట్టడం బహుప్రయాసకరమైనపని. కాస్మాపాలిటిన్ డిన్నర్లకు హాజరయినవారో- ఆమ్లెట్లు, మీట్ సూపులను వాటంగా భక్షించినవారో భోక్తలుగా దొరుకుతూవుంటారు. ఆరోజున మృతుడైన ఆఘనుని స్మరించుకొని నలుగురు మిత్రులకు బాల్ చేస్తే ఎంతో బాగుంటుంది. చనిపోయిన ఆతడు హిందూదేశీయుడుగాన మన హైందవసాంప్రదాయానుసారంగా ఉండే వస్తువులను వుపయోగించడం సబాస్ అయినవిషయం. ఏ అయ్యరు క్యాఫీ హోటలుకో మసాలావడలు, బూంది, తైరువడ, గులాబ్ జామ్ మున్నగువాట్లకు ఆర్డరు యివ్వడం లాహిరీఅయినపని. అక్కడ ఆదూరదేశాన్న అయ్యరు ఉంటాడా అని మనకు యీషన్మాత్రమైన సందేహం ఉంచుకోనక్కరలేదు, అయ్యరు సర్వాంతర్యామి. సర్వస్థలవిహారి. కావున ఈమార్పునకు దేశాంతరపు ఉనికి అడ్డురాదు.

సనాతనులు వెంటనే సభలుచేసి తద్దినాల విషయంలో ఈకొత్తమార్పులను అనుమతిస్తూ తీర్మానాలు చేస్తారని నమ్ముతాము.

ఉచితము ! ఉచితము !

కొలదిప్రతులేగలవు-కొలదికాలముమాత్రమే !

కడుపుబ్బనవ్వించు

## హాస్యగ్రంథములు

1 నవ్వగలవా ?

2 పెళ్లాన్ని యెలాపిలవడం ?

(ద్వితీయముద్రణము)

3 దీనిపేరేమిటి ?

4 అనుమానాలు, ఆయన – ఆవిడ.

పైనాలుగు హాస్యగ్రంథములును కొలదికాలము ఉచితముగా పంచిపెట్టదలచితిమి. పోస్టేజీవగైరా ఖర్చులనిమిత్తముమాత్రము 0-4-9 ముద్రలు పంపవలెను. ఇందులో యేఒక్క గ్రంథము కోరినను 0-1-9 ముద్రలు పంపవలెను. మొత్తముగా కొనువారికి భారీగా కమీషను యొసంగెదము. ఆలసించిన తిరిగి యీతరుణము దొరకదు. త్వరపడుడు. వలయువారు :—

కాంచనపల్లి వేంకటరంగారావుగారు,
సంపాదకులు, "నవ్వులతీవ,"
బరంపురము, (గంజాం.)



## ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలుచందా రు 3. విడిపత్రిక 9 పైసలు.

బర్మాలోని **1,60,000** ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మాఅంతట ప్రచారము గలదు. వర్తకులిందు తమ సరకులను ప్రకటించిన మంచి లాభముపొందగలరు. వివరములకు :—

ఎడిటర్, "ఆంధ్రజ్యోతి"
185, లోవర్ మెయిన్ రోడ్డు,
మోల్మేన్-అని వ్రాయుడు.



బిడ్డలఆరోగ్యబలమునకు

## స్వామీస్ 'బాలజీవన్' (రిజష్టర్డు)

అమృతమువంటిది.

బిడ్డలయొక్క అన్నివ్యాధులను తొలగించి నూతనజీవనము యిచ్చునట్టి అమృతతుల్యమగు ద్రావకము. బిడ్డల అజీర్ణము, కడుపునొప్పి, జ్వరము, విరేచనములు, వాంతులు, జలుబు, కఫము, మొదలగు సర్వవ్యాధులను తొలగించి ఆరోగ్యమొసగును.

వెల ఔన్సు సీసా రు. 0-6-0.
4 ఔన్సుల సీసా రు. 1-4-0.

---

కాల్పులు, నరకులు, నొప్పులకు

## 'సీతమలామా' (రిజష్టర్డు)

సంజీవివంటిది.

అన్ని చర్మవ్యాధులకు పైనవ్రాయుటకుపయోగించు ఓషధీమలామా. కాల్పులమందుగా ప్రఖ్యాతిగాంచినది. మూలవ్యాధిని, ముఖముపై మొటిమలను తొలగించును.

వెల ½ ఔన్సు సీసా రు. 0-6-0.
2 ఔన్సుల సీసా రు. 1-4-0.

---

మావద్ద ఇంకను పెక్కు ప్రశస్తమైన ఔషధములు గలవు. మా ప్రత్యేక ఔషధ కేటలాగునకు వ్రాయుడు. యేజంట్లుగా నుండగోరువారు మాకు వ్రాసిన వివరములు తెలుపగలము.

## అశ్వినీకుమార ఫార్మశీ

నర్సాపురం, పశ్చిమగోదావరి జిల్లా.

# ఇంటికన్న గుడి పదిలము

రచయిత :

హాలుడు, బి. ఏ., బి. ఇడి.

['పెళపెళార్భటుల మర్త్యులమీఁది కుటికెడు పిడుగుల నోర సరివయిచి
గడియ తీరికలేక లోకమునుగాన పరువులిడుచుండు దీనులపాలివాడు'
ఉండినాడనుతలంపు ఒకరెప్పపాటుకాలమైన నీకు కలుగునేమో,
ఓయి! నాస్తికుఁడా! ఈ వ్యాసమును చదివిచూడుము.]

కేవలము ప్రమాదరహితమైనపని యీప్రపంచంలో వున్నట్లు కన్పింపదు. మోటారుప్రయాణంలో ప్రమాదంవున్నది; రైలుబండి పట్టాలు తప్పి పడిపోవచ్చును; ఆకాశవిమానము విరిగి క్రిందపడగలదు; ఎడ్లబండి బోల్తాకొడుతూనే వుంటుంది. పొలందున్నుతూంటే కాలిలో ముళ్లు, గాజుపెంకులు, త్రుప్పుపట్టిన యినుపశేకలు గ్రుచ్చుకోగలవు. వ్రాస్తూంటే నల్లబల్ల (బ్లాక్ బోర్డు) మీద పడుతుంది; తెరచివుంచిన కలం గ్రుచ్చుకుంటుంది; చెక్కుతూవుంటే చాకు తెగుతుంది; నడుస్తూంటే కాలుజారి బెణకుట, విరుగుట కలదు. ఎందులోలేదు ప్రమాదం?

జనసామాన్యములో అన్నిటికన్న యిల్లు నిరపాయకరమైనదనే అభిప్రాయం వొకటివుంది. ఏదైనా వస్తే పెద్దవాళ్లు 'తిని యింటిదగ్గరకూర్చుంటే యేబాధావుండదుగద?' అని పిన్నవారిని మందలించుట కలదు. కాని అది సత్యముకానేరదనుటకు 'ఇంటికన్న గుడి పదిలము' అనే సామెతయే సాక్షి.

అమెరికాలోని ఒకపరిశోధకుని లెక్కప్రకారము విమానయాత్రచేసే 6378 మందిలో ఒకరికి మాత్రము ప్రమాదము తటస్థిస్తే యింటివద్ద కూర్చున్న 24 రిలో ఒకరికి ప్రమాదము తటస్థిస్తూందని తేలినది. ఈలాగే మోటార్లు, రైళ్లు మొదలైనవ్నానిలోనూ వుంటుంది. ఇవి ఒక్కొక్కప్పుడు చిన్నచిన్న దెబ్బలతోను పోతాయి; మరొకప్పుడు అంగవైకల్యము కలిగించుట, ప్రాణాపాయము తెచ్చుట కూడా కలదు.

అమెరికాలో ఒక గృహస్థు తనయింటిముందు పడకకుర్చీలో కూర్చుని కులాసాగా కాలముగడుపుతూన్నాడు. ఆయింటిముందున్న రోడ్డుమీదుగా మోటారు వెడుతూన్నది. దానిచక్రముక్రిందపడి ఒకరాయి యెగిరివచ్చి అతని తలకుతగిలింది. చావుతప్పి కన్ను లొట్టవోయింది అతనికి. తినిపారవేసిన అరటిపండ్ల తొక్కలు గుమ్మములమీద పడియుండడము మనము తరచు చూస్తూనేవుంటాము. వానిమీద పొరపాటున కాలువేసి జారిపడడము, పండ్లూడడము, కాలుచేతులు విరగడముకూడ గలదు. నాస్నేహితుడైన ఒక స్టేషనుమాస్టరు ప్లాట్ఫారముమీద అరటిపండుతొక్కపై అడుగువేసి జారిపడి మునిపండ్లు విరగగొట్టుకున్నాడు.

ఇంకొకపరిచితుని కుమారుడు రెండుమూడేండ్లవాడు జానెడులోతునీళ్లున్న చిన్న గంగాళములో తలక్రిందుగాపడి ప్రాణములు పోగొట్టుకున్నాడు. మాతాతగారి యింట్లో వూరుగాయలకుండ అటుకమీద పెట్టవలసివచ్చింది. ఒకరోజున బలవసి అయిన ఒక స్నేహితుడురాగా బ్రతిమాలి కుండను అతని నెత్తిపైపెట్టి నిచ్చెనమీద ఎక్కించారు. ఆనిచ్చెన యేనాటిదో మరి! అతడు సగముదూరము ఎక్కేసరికి పెళ్లున నిచ్చెనవిరిగింది; కుండతోసహా స్నేహితుడు భూగతుడైనాడు. వూరుగాయలభాండము విచ్చిపోయి అతగాడిని రక్తగాత్రుణ్ణిచేసింది. వూరుగాయి మాతాత పోగొట్టుకున్నాడు; వొళ్లుమంట స్నేహితుడార్జించినాడు.

చంటిపిల్లలు గడపలుపట్టుకొని నిలచుట, అది

చూడక తలుపులువేస్తే చేతులునలగుట తరచు జరిగేవే. ఇంటిలో పూరకేకూర్చున్నపుడు పైనుండి పెంకుముక్క జారిపడి నెత్తిచిల్లుపడుట కలదు. కూరలు తరిగేటప్పుడు చేతులు తెగుట, వంటచేసేటప్పుడు వేడి గంజి మీదపడి బొబ్బలెక్కుట మామూలు విషయాలే.

శీతకాలమందు చలిమంటలువేసికొనేటప్పుడు గుడ్డలంటుకుని ఒడలు కాలడము, ప్రాణాపాయము కలగడము మన మెరిగినదే. రెండు గదులలోనికి కన్పించునుగదా అనే పొదుపుగుణంతో దీపపు బుడ్లను గుమ్మమందు పెడుతూవుంటారు కొందరు. అలాటప్పుడు ఒకగదియందుంచి మరొకగదికి పోతూంటే బట్టలంటుకుని ఒడలుకాలి చచ్చినవా రెందరో వున్నారు. ఈమధ్యనే మద్రాసులో 50 సంవత్సరాల వయసుగల ఒక ప్లీడరు తెల్లవారుజామునలేచి, క్రొవ్వువత్తి వెలిగింపబోగా బట్టలంటుకుని చనిపోయినాడు. చీరచెరగుతో పోయి పైనున్న వస్తువులను దింపబోయి యిట్టిదుర్మరణము పాలగుటకూడా వున్నది. గన్నవరమందు ఒకయామె వర్షకాలము ప్రొద్దుటే పోయి అంటించుట కష్టమగునని యెంచి తాటాకును తీసికొనిపోయి దాలియందుపెట్టివుంచింది యెండుగావుంటుందని. ఆదాలియందు నిప్పురవ్వయే మూలనోవుండి ఆకును అంటించింది. ఆమంట పైకి లేచి యిల్లంటుకుంది.

శీతకాలమందు చలిబాధకు తాళజాలక పలువురు కిటికీలుకూడా మూసుకుని పడుకుంటారు. లాంపులుకూడా ఆర్పుకోరు. గాలి ఆవలకుపోయే త్రోవవుండదు. కనుక లాంపునుంచి, మనుష్యులనుంచి యేర్పడే బొగ్గుపులుసుగాలి అంతకంతకు హెచ్చుట, ప్రాణవాయువు తగ్గుట యేర్పడును. బొగ్గుపులుసుగాలి హెచ్చిన కొలదినిద్రపోయేవారికొకవిధమైన మైకమేర్పడి మెలకువరాదు. ఆమైకము అంతకంతకు హెచ్చి ప్రాణాపాయము వస్తుంది. ఈవిధంగా నిరుడు బొంబాయి మొదలగు పట్టణాలయందు యెందరో చనిపోయినారు.

దాగుడుమూతలు ఆడుకునే పిల్లలు తెరచివున్న పెట్టెయందు దూరి మూతలువేసుకుంటారు. దానిని మళ్ళీ తెరచేందుకు వారికి శక్తిచాలక ఆపెట్టెయందు పడి వుక్కిరిబిక్కిరియై చచ్చిపోతారు. కార్యకరామతులందు గ్యాసులైట్లు వెలిగించుచుము; ప్రతిదినము స్టౌవెలిగిస్తూంటాము. వీటియందు గాలికొట్టిన గాని అవి వెలుగవు. ఆగాలి యెక్కువగా కొడితే ఒక్కొకపుడు వానిభాండములు బ్రద్దలై వేడినూని దగ్గరవారిపైబడి ప్రాణాపాయము కలుగజేయిస్తాయి.

పడుకుంటే మెడనరము పట్టుట, ఎత్తైనమంచము పైనుండి దిగేటప్పుడు కాలుతొలగి బెణుకుట, చేయి విసరినపుడు గూడుతొలగుట, ఆవులించినపుడు క్రింది దవుడగూడు తొలగి ఆతీరుగానే నిలచిపోవుటకలదు.

పడకకుర్చీయందు కూర్చుండి ముందువెనక్కులకు వూగుతూంటాము. ఒక్కొక్కప్పుడు చేతులు దాని జాయింట్లమధ్యపడి నలగడముకలదు. నేనెరిగిన ఒక పాకీవానికి రెండుచేతులయందును చెరిరెండు వ్రేళ్ళకు చివర రెండు కణుపులు తెగిపోయినవి. అలాగే ఒక కాలేజీ ప్రొఫెసరు పడకకుర్చీయందు కూర్చుంటూండగా మెట్టుజారిపోయింది, వ్రేళ్లు కత్తిరింపబడ్డాయి. ఇవి ప్రాణాపాయకరములు గాకపోయినా జీవితమున శాశ్వతమైన వైకల్యముకలిగించి చిక్కుతెచ్చిపెట్టును.

దీపావళి మొదలైన పండుగులకు బాణసంచాలు తయారుచేస్తూంటాము. అవి అవకాశాత్తూ అంటుకుని ఇళ్లు తగులబడడమున్నది. కట్టేవారికి అపాయంకూడా వస్తుంది. నేలటపాకాయలు కట్టే ఒకతనికి ఒకచేయి మోచేతివరకు వూడిపోయింది. ఇంకొకతనికి ఒక కన్ను పూర్తిగాపోయింది. ఆమధ్య విశాఖపట్టణమందు బాణసంచాసామాను అంటుకుని ఒకయిల్లు రూపుమాసిపోయింది. ఆయింటిరాళ్లు దూరంగా వీధేపోయే మనుష్యులమీదను, చుట్టుప్రక్కల యిండ్లమీదను పడి అపాయకారులైన సంగతి చదువరుల జ్ఞప్తియందు యింకా వుండివుంటుంది. ఒకదీపావళి వెళ్ళిన మరునాడు కాలని తాటాకు కాయలను ప్రోగుచేసి, విప్పి, వానియందుమందు ప్రోవుపెట్టి అంటించాను. అందులోవున్న ఒక చిన్నవత్తి ప్రేలి మందు యెగిరి

వచ్చి నాయెడమచేయి బొట్టనవ్రేలు కాలినది.

మొగముమీద మొటిమలు చిదుపుకుంటాము. అది సెప్టికు అయి ప్రాణమోసము వస్తుంది. క్షౌరము చేసి కొనేటప్పుడు గడ్డము తెగి సెప్టికుఅయి చనిపోడము కద్దు. సింగొడియర్ ఐ. సి. యస్. ఇటులే చనిపోయినది. ఆడుకుంటూంటే మనకు తెలియకుండానే చిన్నదెబ్బ తగులుట, అందుండి దనుర్వాతపు క్రిములు ప్రవేశించుట, చచ్చినంతపని అగుట వున్నది.

చెప్పదలచుకుంటే యీలాటివి యెన్నో ఉపద్రవకరములైన విషయాలున్నాయి. కాని వీనినన్నింటిని యేశకనునకు ఆశకను తప్పించుకుంటూ మనమందరము జీవితయాత్రను సుఖముగ చేయగలుగుట అనంతకోటిచక్షువులతో తన సృష్టిని నిరంతరము కనుగొనుచుండే ఆ భగవంతుని కరుణావిశేషమేగదా !

## కృష్ణా! వల్లవీవల్లభా!

శా. నీనామామృతవీచికల్ చెవులకున్ విందయ్యె; నీరూప తే
జోనీరేజమునందు దృఙ్మధుపము ల్శోభిల్లె; నీ సత్కృపా
శ్రీనిండారిన మానసంబు దనిసెన్ సేవింప నీవంటి ని
త్యానందోజ్జ్వలమూర్తియుం గలడె? కృష్ణా ! వల్లవీవల్లభా !

శా. బాలక్రీడల గన్నతల్లికి మనఃప్రహ్లాదముం జేయుచున్
హేలామైత్రిఘటించి గోపకులలో నేపారవర్తింపుచున్
గేళీజారుఁడవౌచు గోపికల కౌఁగిళ్ళ న్వినోదింపుచు నీ
శాలిత్వంబులు నీకెయొప్పునవుఁ గృష్ణా ! వల్లవీవల్లభా !

మ. విలసన్నీలపయోదమండలగళద్విద్యుల్లతాలేఖయున్
బలె మాయాపటలంబు వెల్వడి భవద్భక్తాత్మదేశంబులన్
సులభస్ఫూర్తి నితాంతనిర్మలపరంజ్యోతిస్స్వరూపవై
నలినాక్షా ! పొడచూపుచుండుదువు కృష్ణా ! వల్లవీవల్లభా !

మ. స్థిరవిజ్ఞానవిశేషనిశ్చలితదృష్టిన్ దృష్టిఁజూడంగ సా
గరకల్లోలఘటాపరంపరలలోఁ గన్పట్టు నర్మాకృతిన్
బరమబ్రహ్మవిలోకనాత్ములకు శుంభద్దివ్యతేజస్థితిన్
శరణత్వంబును జూపుచుండుదువు కృష్ణా ! వల్లవీవల్లభా!

శా. నీవే యజ్ఞములున్, దదీయఫలముల్ నీవే, కులాచారముల్
నీవే, మంత్రము నీవె, తజ్జపములున్ నీవే, మనోవాంఛయున్
నీవే, మోక్షము నీవె, చిద్విభవమున్ నీవే వితర్కింప నా
నావర్ణాశ్రమధర్మమార్గులకుఁ గృష్ణా ! వల్లవీవల్లభా !

మ. విలసద్గోపవధూచకోరములకున్ విందై ముఖేందుద్యుతుల్
దిలకింపన్ యమునాసరిత్పులినధాత్రీమండలిన్ దీపికా
వళిక్రీనీడ త్రిభంగియై మురళిరావస్త్రీల గోరాజి ని
చ్చలు మోదాంబుధి దేల్చు నిన్గొలుతు కృష్ణా ! వల్లవీ[illegible]ా !

— నా మా ధ వ ము.

# నక్షత్రాల రాఘవరావు

[ఆంధ్రసేవకుడగు ఈవ్యాసకర్త 'విశాఖమండలపు తెనుగుతనయులు' అను శీర్షికక్రింద 'ఆంధ్రభూమి'యందు వ్రాయ తలపెట్టిన వ్యాసపరంపరయందు శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారిని గూర్చిన ఈవ్యాసము తొలుతటిది.]

ఈయనది ఎలమంచిలి. కొంతకాలమై 'భారతి'లో పేరు నలుగుతుండడంచేత 'నక్షత్రాల' రాఘవరావుగారంటే ఆంధ్రప్రపంచాని కిట్టె అవగాహనమవుతుంది. ఖగోళమండలం వీరికాలి బొట్టనవ్రేలిక్రింద అణగి ఉందంటే అతిశయోక్తి కాదు. ఇందునుగూర్చిన కనీవినీ యెఱుగని అద్భుతవిషయాలు యుగాలపాటు విసుగులేకుండా వివరిస్తారు, వినేవారుంటే. వ్రాసిపడేసిన గుప్తవిజ్ఞానపు ముసాయిదాలు బీరువాలనిండా ఉన్నాయి, ప్రచురణ నిరీక్షిస్తూ. భాష వశ్యమూ, దానికి తగిన పాండితీగరిమ, దాన్నిమించిన పరిశోధనాకౌశలమూ, ఇన్నీ యిమిడిఉన్నయి– వీరి కుక్షిలో. ఇవి రాణించేందుకు తగ్గ ఓరిమీ ఉంది. 'ఆంధ్రగద్యవాఙ్మయచరిత్ర' రచనంలో హేమాహేమీలతో పోటీకినిల్చి రజతపతకం వడయుటకంటే హెచ్చు నిదర్శనమేం కావాలె ? 'ఆంధ్రావళీ' సమాజం నెలకొల్పి 'విఘ్నేశ్వరచరిత్ర' వ్రాసి గణపతిపూజ చేసినాడు. శారదాగంగక్కూడా ఆంధ్ర ప్రాభవం నిలిపే శక్తి ఉందని ప్రదర్శిస్తూ, సమాజంపక్షాన్ని శ్రీ గిడుగు రామమూర్తిపంతులికి సమ్మాన మొసగినాడు. సంఘమంటేనూ, సభలంటేనూ ఈయన చెవికోసికుంటాడు, మహాసరదా ! నలుగురూ కలిసినపుడు పడయగల సర్వతోముఖమయిన విజ్ఞానం ఎన్నిపుస్తకాలు పఠించినా రాదనేమతం. కనుక సభలకు వెళ్లే అ[illegible]ములు పోనాడడు.

వీరేశలింగం, లక్ష్మణరావ్వూ మొదలయిన ఆదర్శపురుషుల సన్నిధిని మెలగిన ఆంధ్రపుత్రుడు ; అగుట వారి ఉన్నతాశయాలన్నీ ఈయన్లో మూర్తీభవించాయి. అస్తమానం వారి ఊబుసే, వారితలపే ! ఆ ఉభయుల్నీ గురించి పవిత్రమైన చక్కని ముచ్చటలు చెపుతూంటే, ఱాలుసైతం కరిగితీరాలె ; ఆంధ్రపౌరుషం రేకెత్తి రక్తం ఉడుకెత్తి తీరాలె !

వీరేశలింగకవి సేవాభాగ్యం కల్గినందుకు వారి గొప్ప అంశమొకటి వీరికి అలవడి, అమలులో ఉంది. వ్రాతలో చిత్తూ సాఫూ రెండు లేవు. ఈ మధ్యనే 800 పుటలకు మించిన ఒక ఉద్గ్రంథం వ్రాశారు. దానికి చిత్తూలేదు, ఒక్కతుడుపూలేదు. అదీ యేవిటి ?—తన వక్కీలువృత్తి సాగించుకుంటూను ; కుఱ్ఱాళ్ళనందరినీ చేరతీసి సహజచిద్విలాసంతో ఆడుతూపాడుతూనున్నా.

నామకరణంచేసిన ఆయన వాక్శుద్ధి ఏమిటోకాని, 'ఆనంద' రాఘవరావు అనేపేరు ఈయనకు సరిపోయింది. ఏమీ అంటే ?—ఉన్నతభావాలలోనూ ఉన్నతకృత్యములలోనూ అంత ఆనందం తాండవిస్తూంటుంది. చాలా మంచిహృదయం ! ఆలోచించి తగిన దానమొకటి చేసినాడు. అది తెనుగువారు త్వరలోనే తెలిసికోగలరు. ఈమహనీయుని గూర్చి ఎంతయినా చెప్పవలసి ఉంది, ముమ్ముందు.

**THE SOUTH INDIA CO-OPERATIVE INSURANCE SOCIETY, LTD.,**

**MADRAS.**

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

హెడ్డాఫీసు : మద్రాసు. పోస్టుబాక్సు నెం 182.

(1) సహకారధర్మములమీద స్థాపింపబడినది.

(2) రాజధానిలోని ప్రసిద్ధసహకారనాయకులచే నడపబడుచున్నది.

(3) రు 100 లు మొదలు రు 5000 లు వరకు పాలసీలు జారీ చేయబడును.

(4) పాలసీదారులే వాటాదారులు.

(5) ప్రీమియము రేట్లు చాల తక్కువ.

(6) ప్రీమియములను రాజధానిలోని కోఆపరేటివు బ్యాంకులలో చెల్లింపవచ్చును.

(7) ఆటోమాటిక్ నాన్ ఫర్ ఫీచరు సౌకర్యముగలదు.

(8) స్త్రీజీవితభీమా యంగీకరింపబడును.

వివరములకు హెడ్డాఫీసునకుగాని, యీక్రింది ఆర్గనైజర్లకుగాని ఏజంట్లకుగాని వ్రాసి తెలిసికొనవచ్చును.

గంజాం ... డి. కృష్ణమూర్తిగారు, ఆర్గనైజరు, మిలిటరీలైన్సు, బరంపురం.
విశాఖపట్టణం ... ఎ. వీరరాజుగారు, మానేజరు, విజయనగరం కోఆపరేటివు సెంట్రలుబ్యాంకి, విశాఖపట్టణం బ్రాంచి, విశాఖపట్టణం.
తూర్పుగోదావరి...పాణంగిపల్లి సత్యనారాయణగారు, ఇన్స్పెక్టరు, రామచంద్రపురం.
పశ్చిమగోదావరి... టి. కుటుంబశాస్త్రిగారు, ఆర్గనైజరు, నిడదవోలు.
కృష్ణా ... జి. రాఘవశర్మగారు, ఛీఫ్ ఏజంటు, గుడ్లవల్లేరు.
నెల్లూరు ... ఎ. సుబ్రహ్మణ్యంగారు, ఆర్గనైజరు. 1250. యం. వి. అగ్రహారం, నెల్లూరు.
అనంతపురం ... ఎ. నారాయణప్పగారు, ఛీఫ్ ఏజంటు, అనంతపురం.
బళ్లారి ... యస్. ఆర్. సుబ్రహ్మణ్యముగారు, జిల్లాఆర్గనైజర్. హాస్పేట.

# ఆమె ఒక జాతి మనిషి

రచయిత:

ఆకుండి సత్యనారాయణ

[గతసంచికకుతరువాయి.]

ఆమాటపైని

'అవును; ఎంతగొప్ప కళావిదులైనా అంతకంటె చేసేదేమీలేదు. ఇతరుల స్వభావాలను ఎంతో సహజంగా చిత్రిస్తున్నట్లు వారు భావించిందల్లా తమ అనుభవాలనుబట్టి వారి స్వభావాలను గురించి తమకు ఏర్పడ్డ అభిప్రాయాలేకాని వారి నిజస్వభావాలెంతమాత్రంకావు. ప్రతీకవీ తను సృష్టించిన ప్రతీపాత్రద్వారా తన ఆలోచనలనే, తనభావాలనే, కేవలం తననే వ్యక్తీకరించుకుంటాడు. అయితే గొప్పతనమంతా తను అనుభవించిన దానిని సహజంగా వెలిబుచ్చగలగడంలోనే ఉంది - కాని అలాగున వెలిబుచ్చగలిగే వారే మనలో చాలా అరుదుగాఉన్నారు. అందుచేతనే మనకథలు ఇంత అస్వభావికంగానూ, కల్పితములవలెనూ గోచరిస్తున్నాయి.' అన్నాడు శర్మ.

దానిపైని 'అవును; మనసులోని భావాలనన్నిటినీ వ్రాతలమూలాన సరిగా వ్యక్తపరచడం చాలాకష్టం. నిజంగా ఆలోచిస్తే హృదయంలోని భావాలను వ్యక్తపరచడానికి తగిన శక్తి మనకున్న సంజ్ఞలకు—మాటలకు, వ్రాతలకు—లేదేమోననిపిస్తుంది. అందుకే మహాకవుల హృదయాలను వారి వ్రాతలమూలాన గ్రహించడం అసాధ్యమేమోనని కూడా ఒక్కొక్కప్పుడు అనిపిస్తూ ఉంటుంది.' అన్నాడబ్బాయి.

ఇలాగున వారిరువురూ మన స్తత్వానికి సంబంధించిన అనేకవిషయాలనుగురించి చాలావరకు మాట్లాడుకున్నారు. ఇంతలో గడియారంపదకొండు కొట్టినందున హోటలుకు వేళ మించిపోతుందని అబ్బాయి లేచాడు. మిగతావారుకూడా అతని వెంటనేలేచి హోటలువరకు అతణ్ణి అనుసరించి తిరిగి సాయంత్రం కలుసుకుందామని చెప్పి అబ్బాయివద్ద శలవు తీసుకుని వెళ్లారు.

అబ్బాయి హోటలునుంచి ఇంటికి వెళ్లేసరికి పన్నెండు దగ్గిరయింది. గతరాత్రల్లా సరిగా నిద్రలేనందునా, భోజనానంతరం ఒక గడియ పడక వేయడం అలవాటులోకూడా ఉన్నందునా విశ్రాంతికై వెంటనే మంచంపైని వెన్నువాల్చాడు.

ఆనాటి మధ్యాహ్నం ౨ంటిగంటకల్లా అబ్బాయి మేలుకుని ఎప్పటికంటె నీటుగా తయారయాడు. పెట్లో సరస్వతిని తీసి మేజాపైనిఉంచి చేత నేదో నవల పుచ్చుకుని విశాలంకోసం ఎదురుచూస్తున్నాడు. గడియారం రెండుకొట్టింది. ఇంకో అరగంటలో విశాలం వస్తుంది. వెనకటిరోజునకూడా రానందున ఆదినం కొద్దిగా ముందుగానే రావచ్చును. రెండుంపావయింది. ఇంకోపావుగంట. అంతే. ఆమె వస్తుంది. . .

తనవ్యాసం సరస్వతిలో పడ్డందుకు తను పొందుతున్న ఆనందాన్నిగాని, దానిని ఆమెకు కనబర్చాలని తను పడే ఆతృతగాని ఆమె కెంతమాత్రం తెలీనివ్వకూడదు. అదేమంత గొప్పవిషయం కానట్లు, తన కాధ్యాసమే లేనట్లు గోచరింపచెయ్యాలి. ఇలా భావించి మేజాపైని ఎదురగాఉన్న సరస్వతిని మరీమూలకు నెట్టి దానితలంపే తనకు లేనట్లు పుస్తకంవంక చూస్తూ కూచున్నాడు.

తనకంత ఆనందాన్ని, గౌరవాన్ని చేకూర్చిన ఆపత్రిక విషయమై తన ప్రవర్తన ఏమైనా ఉచితంగా ఉందా? అది అతని అవిశ్వాసాన్ని, అకృతజ్ఞతను తెలియజేయదా? ఏమో అతని కాతలంపే కలుగలేదు. ఇంతకూ అతడు దానిని నిజంగా తృణీకరిస్తున్నాడా? బాహ్యంగా దానిని నిర్లక్ష్యంచేసినట్లు దూరంగా నెట్టివచ్చును. కాని మనసులో సర్వదా దాన్నిగురించే తలపోస్తున్నాడు. దాని నేస్మరిస్తున్నాడు. దాని రూపాన్నే చిత్రించుకుంటున్నాడు. అతడుచూస్తున్న నవలలో కూడా అతనికి తన కథతాలూకు శీర్షిక, తన పేరు, తనరచనలోని పంక్తులే గోచరిస్తున్నాయి.

ఆమెరాగానే సరస్వతినిచూసి 'కొత్తదే నా?' అని అడుగుతుంది.

తనప్పుడు ఏమీతొణకకుండా గంభీరంగా 'ఔను' అనాలి. అంతే.

ఆమె 'ఎక్కడిది?' అని అడుగుతుంది.

అప్పుడైనా తను 'నాకథ పడింది' అని ఎప్పుడూ బయలుపడిపోకూడదు. ఇంకా నెమ్మదిగా 'నిన్ననే వచ్చింది' అనాలి.

ఆమె వెంటనే పేజీలు తిరగవేసి తనకథ చూస్తుంది. అమితమైన ఆశ్చర్యం పొందుతుంది. నిజంగా ఆమెను ఆశ్చర్యపడేటట్టు చేయడం ఎంతసంతోషకరమైన విషయం?— ఆసంగతి తలుచుకుని అతడు ఆనందం పట్టలేక పోయాడు.

రెండున్నరయింది. కాని ఇంకా విశాలం రాలేదు. ముఖం కొంచెం చెమటపట్టినట్లయితే గదిలోకి వెళ్ళి మరోసారి ముఖం తుడుచుకుని క్రాపు సవరించుకుని మళ్ళీ యథాప్రకారమే వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కాని ఏంలాభం? మూడయింది — అతడు ఎవరికోసం ఇంతగా నిరీక్షిస్తున్నాడో ఆమె రాలేదు. చిన్న చప్పుడయ్యేసరికి మండడిద్వారం తట్టు చూస్తున్నాడు. కాని ఎవరిజాడా లేదు. కాలంజరిగిపోతూంది...

ఇంకా అలాకూర్చుందికి అతనికి ఓపిక సడలిపోయింది. మండడిద్వారంచెంతకు వెళ్ళి విశాలాన్ని కేకవేయాలని ఒకటిరెండుసార్లు ప్రయత్నించాడు. కాని ఆమె రాకపోవడం వల్ల ఒకవేళ భర్తగాని ఇంట్లో ఉన్నాడేమోనని సంశయించి ఆప్రయత్నం విరమించుకుని వీధి తన్నే వెళ్ళవలెనని నిశ్చయించాడు.

సరస్వతిని—పాపం ఇంతవరకూ దాని తలంపే లేనట్లు ఎంతో నిర్లక్ష్యంగా ఒకమూలకు నెట్టిన సరస్వతిని—అందుకుని చేత్తో పట్టుకున్నాడు. తనే దానిని తీసుకునివెళ్ళి ఆమెకు చూపించవలసివస్తుందని అతనింతవరకూ భావించి ఉండలేదు—ఆచిన్న సంఘటన వెనుక 'అంతగర్వం, అంతపొంగు కూడ' దని ఏదేనా భగవన్నిర్దేశం ఉండిఉంటుందా? ఏమో! అతని కాసంగతి తట్టలేదు. పైమీద ఉత్తరీయం వల్లెవాటుగా వేసుకుని విశాలంఇంటికి టెక్కుగా నడుచుకుంటూ బయల్దేరాడు. మెల్లగా గుమ్మంఎక్కి వీధి తలుపు జార్లవేసి ఉంటే తెరచి లోనికి వెళ్లాడు. విశాలం లోపల ఏదోపనిలో మునిగి

ఉంటుందనుకున్నాడు. అలాగైతే బాగానే ఉండును. అందుకు వ్యతిరేకంగా ఆమెచీడీలో చాపమీద తీరికగా కూర్చుని ఏదోపుస్తకం చదువుకుంటూంది.

అడుగుల చప్పుడయేసరికి ఆమెముఖమెత్తి అతనివంక చూసింది. ఆచూపు—ఏమిటా చూపు? ఆచూపులో వెనకటిప్రేమ, మాధుర్యం ఏమీలేవు సరికదా 'ఇత డెందుకు వస్తున్నాడు?' అనే తీక్ష్ణభావం అందులో అతనికి స్ఫురించింది. అబ్బాయి నిలువునా నీరైపోయాడు. ఏమిటా చదువుతున్న పుస్తకం? శాస్త్రిరచించిన కథలపుస్తకంవలె ఉంది. ఆమె కెలావచ్చింది? శాస్త్రి రెండు రోజులాయివచ్చి పక్కమేడలో బసచేసిన సంగతి అతనిస్మృతికి వచ్చింది. అప్పుడే అతనితో పరిచయంచేసిందా? ఇంతలోనే ఆమె నాతడు తనవలలో వేసుకోగలిగాడా? ఏమో, అలాగేకనబడుతూంది—అతడు సామాన్యుడుకాడు, ఆమె నిర్లక్ష్యభావం చూసి తను ఆమెకోసమే వచ్చినట్లు తెలియజేయడం అతని కిష్టంలేకపోయింది. అందుచేత తాను ఆమెభర్తకోసం వచ్చినట్లు 'మీఆయన ఇంట్లోలేరూ?' అని ప్రశ్నించాడు.

'లేరు' అని వెంటనే జవాబువచ్చింది.

అతడు నిరాశచెందాడు, ఆగొంతుకలో ఎటువంటి చలనంగాని, ఆతృతగాని ఏమీ లేవు. కేవలం తనభర్తకోసం వచ్చినమనిషిని చూసినట్లే చూస్తూంది. తను ఆమెకోసమే వచ్చినట్లు ఆమెకు తెలీదా? తెలీకేం? కాని తెలీనట్లే ఆమెకు తనతోఏమీ సంబంధం లేనట్లే నటిస్తూంది. ఇంకొకడైతే వెంటనే వెళ్ళిపోవలసినవాడే. కాని అబ్బాయి కెందుచేతనో కాళ్లురాలేదు.

కొంతసేపయాక 'సాయంత్రంగాని రాడు కావోలు!' అన్నాడు వెళ్ళిపోతున్నట్లు ముఖం తిప్పి.

'ఏం? ఆయనతో అంతతొందర పనేమైనా ఉందా?' అని అడిగింది.

పిడుగుపడ్డట్లయింది అబ్బాయికి—కాని ఆమె చలించలేదు!

'ఏంలేదు! నాకథచూస్తానని సరస్వతి ఒకసారి ఇమ్మన్నాడు; ఉన్నాడేమోనని తీసుకు వచ్చాను.' అన్నాడు.

అత డామాటలుఅనాలని అనుకోలేదు. కాని ఆమెకు తనయందున్న గౌరవభావం ఎందుచేతనో తగ్గిందని గ్రహించి దానిని తిరిగి నిలబెట్టుకోవాలన్న ఆతృతలో ఆమాటలు ఆత డనుకోకుండానే, అతని ఇష్టానికి వ్యతిరేకంగానే అతని నోటమ్మట వెలువడ్డాయి.

దానితో ఆమెకొంచెం ఆతృత కనబరుస్తుందని అత డనుకున్నాడు. తనకథలు ఎందులోనైనా ప్రకటింపబడాలని ఆమె తనకంటె ఎక్కువ ఆతృతపడుతూఉండడం అతనికి తెలుసు. అందులో సరస్వతివంటి పత్రికలో ప్రకటింపబడినప్పుడు ఆమె ఆనందానికి మేర ఉండదని అతని ఊహ.

కాని అతడు భావించినట్లు ఆమాటలు కూడా ఆమెహృదయంలో ఎటువంటి చలనం కలిగించలేకపోయాయి. ఆమె ఇంకానిర్లక్ష్యంగా అతని కథతోటిగాని, దానిప్రకటనతోటిగాని ఆమె కేమీ సంబంధంలేనట్లు 'అయిదైతేకాని రారు.' అంది.

'సరే; అంత తొందరేంలేదు.' అంటూ అతడు గిరుక్కున కదిలిపోయాడు—కాని అతనిహృదయం చాలాబాధపడింది. అతనికి చాలా చిన్నతనంవేసింది. 'ఛీ, ఏమిటింత అవివేకంగా ప్రవర్తించాను?' అని తనని తనే నిందించుకు

న్నాడు—మోహంఎంతటి వివేకులనుకూడా మూర్ఖులనుగా చేస్తుంది. తిన్నగా ఇంటికిమళ్ళీ మేజాపైని సరస్వతిని పడవైచి షికారుబయ ల్దేరాడు. ఆనడకలో ఎందుచేతనో వెనకటి టెక్కు, ఆదర్జా లేవు—హృదయంమీది దెబ్బంటే సామాన్యంకాదు.

అంతేనా? ఇంకా ఉంది.

ఆమరుచటిదినం ఉదయం అబ్బాయి విశాలంసంగతేమిటో కనిపెడదామని డాబామీదకు వెళ్ళి తెరచాపలసందులోంచి ఆమెపెరటి తట్టు చూస్తున్నాడు. అతడు భావించినట్లే విశాలం తెల్లని సన్నచీరా, గులాబివన్నె రవికా ధరించి పూలసజ్జ పట్టుకుని లావణ్య రేఖవలె మెల్లగా పెరట్లోకి వచ్చింది. ఎందుకు? కేవలం పూలుకోసుకుందికే అని ఊహించడంకష్టం. ఆమె నల్లనిముంగురులూ, సన్ననిపైటతెర చల్లనిగాలికి అల్లల్లాడుతున్నాయి. ఆమె జాజిపందిరికిందకు పూలు కోస్తూంది. శాస్త్రి వారిడాబామీద నిలుచుని ఆమెవంకే చూస్తున్నాడు. అత డలా చూడడం విశాలానికేమీ కష్టమనిపించలేదు; పైగా సరదాగాకూడా ఉండవచ్చును— అతడు తనవంక చూస్తున్నాడని తెలిసినప్పుడల్లా ఆమె మరీ చకచకలాడుతూంది.

ఆమె కిందనున్న పూలన్నీకోసి పైకొమ్మలనున్న పూలు అందుకోవాలని పక్కనున్న సిమ్మెంటు తిన్నెమీది కెక్కి రెండుచేతులూ పైకిచాచింది. ఆసమయంలో గుండ్రని ఆమె బుజాలతీరు, విశాలవక్షపు ఉబుకూ మరీస్పష్టంగా గోచరిస్తున్నాయి అబ్బాయికి. శాస్త్రికి కూడా గోచరించవచ్చును. కాని ఆమెకాఆలోచనే లేనట్లు నటిస్తూంది.

అయినా ఆమె చేష్టలన్నీ శాస్త్రికోసమేనని అబ్బాయి సులువుగానే గ్రహించగలిగాడు. అవును; తనకోసం ఆమె అలాప్రవర్తించిన సమయాలెన్నో ఉన్నాయి. ఆమె పక్కకు తిరిగేసరికి శాస్త్రి దృష్టి సరిగా ఆమెకళ్ళమీద వాలింది. ఆమె కృతజ్ఞతతో బదులీతీర్చింది. ఇరువురిచూపులూ తిలకించేసరికి సర్వమూ గోల్పోయినట్టయింది అబ్బాయికి. అత డిలా భావించాడు:

'ఛీ, ఏమిటి దీనిసాహసం? అతడు వచ్చి ఇంకా రెండురోజులైనా కాలేదు; అప్పుడే ఆతణ్ణి ఆకర్షించడానికి ఎన్నివేషాలు వేస్తూంది? తుచ్ఛురాలు! తనకోసం అలా నటించి ఎంతోకాలంకాలేదు! సిగ్గనేది ఒక్కరవ్వకూడా దీనికి లేదు కాబోలు?'

ఇంకా వారిచూపు లలాగే కలుసుకుని ఉన్నాయి—అబ్బాయి కిందకు దిగిపోయాడు.

ఇంతవరకు విశాలానికి ఎప్పుడూ తనుతప్ప వేరేలోకమే ఉండదనీ, తనని చూడకుండా ఒక్కపూటకూడా ఆమె ఉండదనీ అబ్బాయి భావించేవాడు. నిజమే—అబ్బాయి దర్శనం కోసం అనుక్షణము ఆమె వేగిపోయే సమయాలు, ఆతడు కనబడకపోతే ఒక్కపూట కూడా బతకలేనేమోనని ఆమె తపించిన సమయాలు ఎన్నో ఉన్నాయి. కాని అది
కేవలం ఆతనిమీద ప్రేమచేతనేకాదు-స
అవకాశం లభించకపోవడంచేతనే. ఆ
దృఢమైన పట్టు ఆమెకు దొరికినదా
రక్షణమందే తనని అతిసులువుగా
గలదని—విడిచిపెడుతుందని—అ
డర్థమయింది.

౫

శాస్త్రిని తలుచుకుంటూ
పోతూంది. మొదటిసారి అతణ్ణి చూ
ఆవల్లెవాటు ఉత్తరీయం, ఆచక్కదన
ఖమూ, చిరునవ్వుతో ఎప్పుడూ ఏదో చమ

త్కారంగా మాట్లాడడానికి సిద్ధమవుతున్న పెదవులూ ఆతడూ ఆమెదృష్టిని బాగా ఆకర్షించాడు. ఆతనిమాటలు వినేసరికి, చూపుల చిత్రాలు చూసేసరికి అతనిమీద అభిలాష మరీ గాఢమై, అతణ్ణి ఆకర్షించాలనీ, అతణ్ణి చూస్తూ, ఆతనిమాటలు వింటూ ఎల్లప్పుడూ అతనిచెంతనే ఉండిపోవాలనీ ఆమె కనిపించింది.

శాస్త్రి? అవును. ఆంధ్రదేశంలో అతణ్ణి తెలీనివాళ్లెవరు? అతనికి నిండారా పాతిక సంవత్సరాలైనా లేవు. అప్పుడే అతనిపేరు దేశమంతటా మారుమ్రోగి పోతూంది. నాలుగైదు సంవత్సరాలనుంచి ఏపత్రికలో చూసినా అతని ఫోటోలే, అతనిగురించిన పొగడ్తలే, అతని వ్యాసాలే. కీర్తికాంత అతణ్ణి వలచి, అతనినుదిటిని ముద్దుపెట్టుకుంటూంది. అతడు గొప్పకవి, కథకుడు, విమర్శకుడు, తత్త్వవేత్త, ఇంకా ఏంకాకపోతాడు? యువకవులందరూ అతణ్ణి ఆదర్శకునిగా భావించి పూజిస్తారు. యువకులూ, విద్యార్థికులూ అతని మార్గాలనూ, వేషాలనూ ప్రతి చిన్న విషయంలో కూడా అనుకరించకుండా ఉండలేరు. అత డావూరు వచ్చి రెండుమూడు దిన ...ఖుంది. అతడు వచ్చినరోజున పురజనుల ...కి మేరలేకపోయింది. ఆదినమున ...లో అతని ఉపన్యాసం జరిగింది. ...డితులతోనూ, విద్యార్థికులతో ...పోయింది. అతడు కంటబడే ...కులలోనుంచి, యువకులలో ...దయసమయాన సముద్రపు ...కర కాళధ్వనులు చెలరేగి అతడు ...కు వచ్చిన పదినిముషాలవరకు ఆ ...ము. అంతగొప్పవాడు భార్యాసమేతుడై ఆవూరు రావడం ఆపురజనుల సుకృతఫలం—విశాలం ఇంటిపొరుగునే బసచేయడం ఆదంపతుల అదృష్టం.

ఆమరుచటిదినం ఆదివారం. అందరకూ శలవు. కవులూ, పత్రికాధిపతులూ, పండితులూ, విమర్శకులూ అందరూ అతణ్ణి చూడడానికి, అతనితో పరిచయంచేసుకుందికి తిరగబడిపోతున్నారు. విశ్వనాథంకూడా వెళ్ళి అతని పక్కను కూర్చున్నాడు. విశాలంకూడా వెళ్ళి అతనిభార్యచెంత కూర్చుంది. అందరూ అతని కావ్యములలోని తలోపద్యమూ, తలోగేయమూ చదువమని, పాడమని కోరుతున్నారు. అతడు వాటిని చదువుతూఉంటే ఊపిరులను కూడా గట్టిగా విడవకుండా వింటూ తన్మయత్వంతో ఆనందబాష్పాలు రాలుస్తున్నారు. అతని పద్యములూ, పాటలూ రానివాళ్ళెవరు? విశాలంకూడా అతని కృతులలోని రెండుమూడు పాటలు పాడమని అతనిభార్య ద్వారా పురమాయించింది. వెంటనే అతడు వాటిని పాడేడు. అత డెంత సహృదయుడు? ఎవరిమాటాకూడా తోసిపుచ్చలేదు. ఏమిటిది? ఇదివరకు అతడు చాలాగర్విష్టిఅనీ, ఎవర్నీ లక్ష్యంచేయడనీ అతణ్ణిగురించి ఎన్నో పుకార్లు విన్నాది విశాలం. కాని నిజంగా ఆతణ్ణి చూసేసరికి తనువిన్న దాని కంతా వ్యతిరేకంగా ఉంది. అవన్నీ ఆతని గొప్పతనాన్ని చూసి ఓర్వలేని అసూయాపరుల కల్పనలని ఆమెకు బోధపడింది. తనుకోరడమే తడవుగా ఆతడు పాడడం, ఆతని ఉత్సాహం చూసి తనపైని ప్రత్యేకాదరణ చూపుతున్నాడేమోనని ఆమె మొదట భావించింది. కాని అందరి ఎడలా ఆమోస్తరుగానే ప్రవర్తించడం చూసి అది ఆతని స్వభావమే అని తెలుసుకోగలిగింది.

సాయంత్రం ఆమె ఇంటికి వెళ్లింది

మొదలు అతని గురించే ఆలోచిస్తూంది. అతని గురించిన ఆలోచనలతో ఆరాత్రల్లా ఆమెకు నిద్రలేదు.

మర్నాడు ఉదయాన్నే విశాలం మామూలుగా పక్షులతో మేలుకుని దంతధావన చేసుకుని పూలుకోసుకుందికని సజ్జపట్టుకుని పెరట్లో జాజిపందిరికిందకు వెళ్లింది. పూలు ఎత్తున ఉన్నందున పక్కనున్న తిన్నెమీదనిలచి రెండు చేతులూ పైకెత్తి పూలందుకుంటున్న సమయాన ఆమెదృష్టియాదృచ్ఛికంగా ఎదుటిడాబాపైని నిలుచున్న శాస్త్రిపై నిలపడి అతడు చాలసేపటినుంచి తనవంకే పరికించి చూస్తున్నట్టు ఆమెకు తట్టింది. ఆమె నిలువెల్లా సిగ్గయింది. చప్పున రెండుచేతులూ కిందకుదించుకుంది. ముఖం వాల్చుకుంది. పాపం, అతడక్కడ నిలుచున్నట్టు ఆమెకేం తెలుసు? కొంతసేపటికి ఇంకా అతడు ఉన్నాడో వెళ్ళిపోయాడో అని ముఖమెత్తి చూసేసరికి అతడింకా అక్కడే నిలుచుని ఆమెవంకే చూస్తున్నాడు. అతని కళ్ళలోనివెలుగు, ముఖంలోని ఆనందమూ చూసి కళ్లుతిప్పుకోలేక అలాగే ఉండిపోయింది విశాలం. కొంతసేపటికి తేరుకుని ఆమె లోనికి వెళ్ళిపోతూఉంటే శాస్త్రికళ్లు ఆమెను వెన్నాడుతున్నట్లనిపించి ఆమెకాళ్లు తొట్రుకున్నాయి. తననడకా, చేష్టలూ స్వాభావికంగా కనబడాలని ప్రయత్నించిన కొద్దీ ఆమె అడుగులు మరీ తడబడిపోవడం మొదలుపెట్టాయి. ఆమె లోనికివెళ్ళిందిమొదలు తిరిగి అతణ్ణి చూడాలనే అభిలాషతో ఆమె హృదయం తహతహలాడిపోతూంది.

అబ్బాయిసంగతేమిటి? ఏమి టబ్బాయి సంగతి! అతనిసంగతి ఇప్పు డెవరికి కావాలి? అతడు విశాలానికి చిరపరిచితుడు కావచ్చును. పైగా రెండుమూడు మాసముల నుంచి ఒకరొక్కరు ఒక్కక్షణమైనా విడువజాలకుండా ఎంతోచనువుగా మెలగిఉండవచ్చును. ఒకరిప్రేమను ఒకరు పూర్తిగా అనుభవించి ఉండడంకూడా వాస్తవమే కావచ్చును. వాటన్నిటిలోనూ ఎంత సత్యముండాలో అంతసత్యం ఉంది.

కాని విశాలంమనస్సుకి స్థిరత్వంలేదు. ఎల్లప్పుడూ ఏదోనూతనత్వంకోసం వెతుక్కుంటూ ఒకస్థలంనుంచి ఇంకోస్థలానికి నిత్యమూ పరిభ్రమిస్తూ ఉంటుందికాని—ఒక్కచోట నిలకడగా ఉండిపోయే స్వభావంకాదు ఆమెది.

మధ్యాహ్నం రెండుగంటలయింది. భర్త ఆఫీసుకువెళ్లాడు. విశాలం చక్కగా తలదువ్వుకుంది. సన్ననిచీర కట్టుకుంది. అద్దంలో తన అందమంతా ఒకసారి చూసుకుంది. పురుషప్రపంచమంతా తనపాదాలచెంత నున్నట్లనిపించిం దామెకు. తను చెయ్యవలసిందంతా కొంచెం ఆకర్షణీయంగా కనబడేందుకు అంతమాత్రం ప్రయత్నిస్తే చాలును. అందులో తప్పేముంది? ఎవరుమాత్రం అలాచేయకుండా ఉంటారు? పాతివ్రత్యం, పవిత్రతా—అవి ఆకర్షణలేని అవివేకపుస్త్రీలు వారి చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు చెప్పుకునే సమాధానాలని ఆమెకు తట్టింది. అంతే—శాస్త్రిఉన్న బసకు బయల్దేరడానికని అద్దం ముందు నిలుచుని మరోసారి చీరకుచ్చిళ్లూ, పైటా సవరించుకుంటూంది.

ఇంతలో వీధితలుపు మెల్లగా తెరచినట్లయి సావిట్లో ఏవో పదములచప్పుడు వినబడేసరికి ఎవరా అని వెలుపలికివచ్చి చూసింది—శాస్త్రే మెల్లగా వస్తున్నాడు!

విశాలం నిర్ఘాంతపోయింది. అతడే ఇలా తనింటికి వచ్చేభాగ్యం తనకు లభిస్తుందని ఆ

మె కలలోకూడా అనుకోలేదు. ఆతనిదర్శనం కోసం నిత్యమూ పరితపించిపోతున్న ఆమెకు అప్పుడెందుచేతనో కొంచెంబెదరు కలిగింది.

ఆతడు ముందుకువచ్చి 'పంతులుగారున్నారా ?' అని మృదువుగా ప్రశ్నించాడు.

ఆమె సంకోచిస్తూ 'లేరు ! ఇప్పుడే ఆఫీసుకు వెళ్లారు.' అంది.

'అలాగునా?' అని ఆతడు ఆగిపోయేసరికి ఆతడు వెళ్ళిపోతాడేయో అని ఆమెకు ఆందోళనకలిగింది. తనని వొదులుకోడం ఆమెకెంతమాత్రం ఇష్టంలేనట్లు అతికాపీనంతో కూడిన ఆమె చూపుల్లో ఆతనికి వ్యక్తమైనందున శాస్త్రి కొంచెంఆగి 'మళ్ళీ ఎన్నిగంటలకు వస్తారు ?' అని ప్రశ్నించాడు.

ఆమె చిరునవ్వుతో 'ఏమి, పనిమీదవచ్చినట్లున్నారు !' అని ఎంతో మృదువుగా అడిగింది.

'ఏమీలేదు...మీ ఇల్లోసారి చూదామనీ—' అన్నాడు చిరునవ్వుతో.

'అంతకంటేనా? రండి ! చూదురుగాని !' అంది విశాలం అమితమైన ఉత్సాహంతో. ఆదరపూరితములైన ఆమె పలుకులను తోసిపుచ్చలేక అతడు మెల్లగా ముందుకువచ్చాడు.

ఆమె ఎడమచేతివైపునున్న గదివైపు చూపి 'ఇలారండి!' అంది-ఆతడనుసరించాడు.

ఆత డాగదిలో చక్కని పోశ్చర్లలోనున్న గోహారు, సులోచన, సబిత మొదలైన సినీమానటుల ఫోటోలను తిలకిస్తున్న సమయాన విశాలం చప్పున ఏదో పనున్నట్లు వెలుపలకు వచ్చి వీధితలుపు గడివేసింది. తరువాత రెండవవైపునున్న గదికూడా చూపి వెనకటింట్లోకి దారితీసి శాస్త్రినిరమ్మని సంజ్ఞ చేసింది. ఆతడు మెల్లగా అనుసరించాడు.

—సశేషము.


## భారతదేశ సంస్థల ప్రోత్సహింపుడు

సల్పప్రీమియములు | ప్రత్యేక సౌకర్యములు | ఆధునిక పద్ధతులు.

1. 'ఏ' మొదలు 'జడ్' వరకుగలస్కీము, 2. బిడ్డల విద్యావివాహముల స్కీము, 3. సమిష్టి జీవితభీమా, 4 స్త్రీలభీమా, 5. యావజ్జీవితపు ఫించను ఏర్పాటు, 6. భార్యాభర్తల జాయింటు లైఫ్‌స్కీము ప్రత్యేకసౌకర్యము.

అదియు నిదియు అననేల ? వీరువారననేల ? ఎల్లరకును అందుబాటులోనున్న జీవిత భీమాపాలసీని పొంది మీపోష్యవర్గమును పోషింపుడు.

కంపెనీ ఆర్థికస్థితి గాంచనగును.
గవర్నమెంటు సెక్యూరిటీ రు 2 లక్షలు.
జీవితమూలనిధి రు 6 ,,
చెల్లించిన క్లెయిములు రు 14 ,,
1933-34 లో చేసిన వ్యాపారము రు 35 ,,

ధారాళమైన కమీషన్, వేతనములపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

ఇట్టి విశేషసౌకర్యములు కలవు కాన నేడే వివరములకు వ్రాయండి:

సూపరింటెండెంటు

**ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ, (ఢిల్లి)**

**The Venus Assurance Company Ltd., Delhi.**

బ్రాంచి ఆఫీస్ : 22, సెకండులైను బీచ్, మదరాసు.

లేక మీకు సమీపమునగల ఏ బ్రాంచి ఆఫీసుకైన వ్రాసి తెలిసికొనుడు.

# తిక్కన్నను సమర్థింపగలమా?

రచయిత:

దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

['మ. మహనీయంబుగ నంధ్రభూవలయముం బాలించుచుం బ్రాజ్ఞులై
బహుకావ్యంబులు చెప్పుచున్, మఱియుఁ జెప్పంజేయు చాముష్మిక
స్పృహతో ధర్మము లాచరించుచు, జగజ్జేగీయమానంబుగా
నహముల్ పుచ్చిన రెడ్డిరాజులసము ద్యత్కీర్తిఁ గీర్తించెదన్.'

అని కవులచే కొనియాడబడిన నాటి రెడ్డిరాజుల కీర్తిని నేడును యథాశక్తిని నిలుపుచున్నవారు నెల్లూరుమండలపు రెడ్లు. ఈ వ్యాసకర్తలగు శ్రీయుత దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు అట్టి నెల్లూరు మండలమునకు చెందినవారు. సర్వసాధారణముగ ఒక్కకుదిటిలో ఇమిడియుండని విత్తము, వితరణ, విజ్ఞానము శ్రీవారియందు అపురూపముగ మేళవింపునొందినవి. దినమున షష్టిఘడియలును శ్రీవారు సారస్వతగోష్ఠియందే యుందురని మును విన్నది సత్యమేయనుట ఈపత్రికాసంపాదకుడు ఇటీవల శ్రీవారి సన్నిధిని గడపిన రెండు దినములలో తెలిసికొనగలిగెను. నిరంతరకావ్యగోష్ఠీప్రియులగు శ్రీ రెడ్డిగారి వ్యాసములు కొన్ని ఆంధ్రపాఠకులకు 'ఆంధ్రభూమి,' 'భారతి', ఉగాదిసంచిక మున్నగు పత్రికలవలన చేకూఱియున్నవి. 'భీష్మప్రతిజ్ఞ', 'కౌంతేయులు','గాంధారేయులు', మున్నగు వారివ్యాసములు వారి భారతసవిమర్శపఠనమునకు మానదండములై యున్నవి. ప్రస్తుతవ్యాసమున శ్రీవారు లేపిన జిజ్ఞాస అలంతియగునది కాదు. విజ్ఞులు విమర్శించి నిగ్గుతేల్చెదరు గాక !]

## ౧

కీచకుడు తన అప్పకు మ్రొక్కఁజని 'సుదేష్ణకనతిదూరంబుననున్న ద్రుపదరాజనందనం గనుంగొని' మోహించెను. పిమ్మట తనఅప్పకడకేగి ద్రౌపదీ వృత్తాంతమును ప్రశ్నించెను. సుదేష్ణ విచారముతో అతనికి సుముఖముగా ప్రత్యుత్తరమీయక 'ఒండుపలుకులు' పలికిన, కీచకుడు 'సత్వరుండై క్రమ్మఱి ద్రౌపదియున్నయెడకుంజని అత్తాడుచు' 'తనయభిలాషంబు తేటపడ' పలికెను. దానికామె నయమున భయమున వారించి, కడపట ధిక్కరించి పలికెను. అంత కీచకుడు తన అప్పకడకు మగుడ

చని మదనాగ్నిజ్వాలలు
దనుకగ నిట్టూర్పుగాడ్పుదండడి నిగుడం
దను నూరార్పఁగ సఖి దొర
కొనమికి వెనుఁబడుచు గీచకుం డాసతితోన్

ఏనప్పుడు నీకుంజూపి యన్వయనామధేయంబులడిగిన యప్పొలఁతి వలనం జిక్కి చిత్తంబుత్తలపడుచున్న యది. యిటనీఁద నీవయెఱుంగు. దయ్యింతి యింతసేపు నీచేరువనుండి యిప్పుడేట మెలఁగెనని యడిగిన

విని యతని వేగిరపాటునూచి, శిరఃకంపంబు సేయుచు సుదేష్ణ నిజాంతర్గతంబున...'

## ౨

ఈమూలమునకు * 'ఆంధ్రభారతకవితావిమర్శన' మందు క్రింది వ్యాఖ్యానము కలదు :—

'కీచకుఁడు మదనాగ్నిజ్వాలలు దనుకఁగ, నిట్టూర్పు గాడ్పు దండడి నిగుడ నాసుదేష్ణయొద్దకుఁ బోయినను, నింతకుఁబూర్వ మాతఁడు ద్రౌపదినిగూర్చి యడిగినపుడే యీతనిసంగతిని గ్రహించి 'యీతని చిత్త వృత్తి మరలుప ననురూపంబగు నుపాయముఁ' గాన లేని దగుటచే, నిప్పుడు నేమియు మార్గము దోచకుండుటచేఁగాఁబోలు తననుగానట్లూరుకొనినది. కాని యూరార్పు దొరకొనలేదు. పైగా తప్పించుకొనదల చిన దానివలె నావలకుఁబోయినదట. మూలములో వలె 'సప్రోవాచసుదుఃఖార్తో' అని కీచకుఁడు వెళ్ళినతోడనే యామెకు నమస్కరించి. తనసంగతి చెప్పుకొనుట కవకాశ మిచ్చుటఁ గలుగలేదు. సుదేష్ణ విషయమునఁ గొంత యభినయమునూచించినాడు తిక్కన. ఇదియు నిచ్చట యామె శీలమునకుఁదగియే యున్నది. తమ్మునియెడల సోదరప్రేమకలదే యైనను తానీ విషయమున జోక్యముకలుగఁజేసికొనకుండఁ దప్పించుకొనఁ జూచుటవలననే యీమెగడుసుదనము ప్రౌఢత్వమును వెల్లడియగుచున్నవి. కాని కీచకుఁ డేమిచేయఁగలఁడు? ఆమెవెంటఁబడినాడు. ఇప్పుడా ద్రౌపది యామెయొద్ద లేదన్నసంగతి తెలిసియు 'ఏనప్పుడు నీకుంజూపి యన్వయనామధేయంబులడిగిన యప్పొలతివలనం జిక్కి చిత్తంబుత్తలపడుచున్నది. యటమీద నీవయెఱుంగుదు. అయ్యింతి యింతసేపు నీచేరువనుండి యిప్పుడెట మెలఁగె' నని యేమియు నెఱుగనట్లు—తానామెచేఁ బ్రత్యాఖ్యాతుఁడగుటను గోపనముచేసి—యామె నడిగినాఁడు.

మూలములో నీగు ప్తభాషణంబేమియులేదు.'

* శ్రీయుత కోరాడ రామకృష్ణయ్యగారు, ఎం.ఏ. తెలుగురీడరు. మద్రాస్ యూనివర్సిటీ.

## 3

ఇందు నాజిజ్ఞాస యేమియన ! :—

కీచకుడు 'ద్రౌపదివద్దనుండి వచ్చుచు తన అప్పను 'అయ్యింతి యింతసేపు నీచేరువనుండి యిప్పుడెటు మెలగె'నని యడుగుటకు ఆతనిలో ఒక అవస్థాభేదమును కవినూచించి యుండవలెనుగదా ! విమర్శకాభిప్రాయము ప్రకారము:—వెనుఁబడుటను వెనుక పడుటగా ఊహించినను వెనుజిక్కుట లేక కూడఁబడుట (చేరుట) అను అర్థములు స్ఫురించును. కాని వెంటబడుటగా అర్థమురాదు. అయినను ప్రయోగములు కలవేమో పరిశీలించవలయును.

'తను నూరార్పగ సఖిద్వారకొనమికి' అతడు వెంట బడిన ఏమానసికావస్థాభేదము కానుపించదు. ఒక వేళ యీ అర్థమును గ్రహింతమన్నను బాధకము కలదు. మగుడజనుదెంచిన కీచకుడు అప్పకు కొంత దూరమునందు నిలుచునుగదా ! అప్ప ఓదార్పమికి--సమీపించి మాట్లాడుటగా దోచునేకాని. సుదేష్ణ వెళ్ళినటుల కవిచెప్పకనె మన మెట్లూహింపగలము ? కాని కథాసంవిధానమునంగల లోపమును చక్కబెట్టి, సుధేష్ణా కీచకుల గుప్తసంభాషణమునకు (దూరాలోచనకు) అవకాశమిచ్చుచున్నది. లేనిచో పరిచారికల సమక్షమున ద్రౌపదిప్రోలను (ఈమెవెళ్లుట నూచించనందున) కీచకుని ప్రోత్సాహముచే సుధేష్ణ సంధానకృత్యమునకు పాల్పడినదగును. వీరిద్దరి రహస్యమును వినిన ద్రౌపది ఎట్లు సుధేష్ణమాయమాటలకు ఒడబడి కీచకునియింటికి కల్లుతేబోవును ? కావున ఈకథాసంవిధానలోపమును కప్పిపుచ్చుటకు విమర్శకులు యింత వ్యాఖ్యానము వ్రాసిరేకాని వెనుఁబడు క్రియకు నిఘంటువున నీయర్థము కాన్పింపదు. చిత్తగింపుడు :—

వెనుఁబడు—1 విషాదించు * 2 ఖేదపడు.

అను అర్థములు శబ్దరత్నాకరమునందు వ్రాయుట

* (విషాదించుటకు: అపరాధ ధనహాన్యాదులచే ఉపాయములోచక మనసున ఖేదపడు)

యేగాక అచట ఈపద్యమునే ఉదాహరించినారు. కావున వెనుఁబడుచు—అపరాధముచే ఉపాయము తోఁచక మనసున ఖేదపడుచు- అసందర్భప్రలాపము లాడెనని సూచన ఊహ్యము. ఈ అర్థముచే సుధేష్ణా పరిచారకాదులు కొలుకదల్పలేదని సిద్ధాంతమగుచున్నది.

'భగిన్యా అగ్రతఃస్థితః' అనుమూలకథానువాదముచే తిక్కన కావించెను. తిక్కననాటి మూల గ్రంథము ఈ సంవిధానము కలదై యుండి యుండును. లేకపోయిన మూలముకంటె అన్యాయమగు సంఘటనము (అప్పయెదుటనె, పరిచారికల యెదుటనె ద్రౌపదీకీచకుల సల్లాపము) కూర్చి కథను పాడొనరించె ననవచ్చునా ? లేక తెనుగు వ్రాతప్రతులందు నీకూర్పు ప్రారంభమున కలిగెనా ? అను సంశయములు నన్ను బాధించుచున్నవి. అయినను తిక్కన ప్రతిజ్ఞను పరికింపుడు:—

కథ జగత్ప్రసిద్ధి గావునఁ బూర్వ ప
ర్వార్థయుక్తి సేయునట్టి యెడల
యత్న మించుకంతయయినను వలవదు
వలసినట్లు చెప్పవలసియుండు.

ఈ నియమమును పాటించిన కవిబ్రహ్మ సంవిధానలోపమును మనము విమర్శింపరాదు.

మూలమునందు లేని చమత్కారసంభాషణములకు వర్ణనాభినయాదులకు మనమందరము ఆనందముతో తలలాడించవలసినదే, కాదనువారుండరు. ముమ్మాటికి వుండరు.

మరియు శబ్దరత్నాకరమందలి అర్థము కీచకుని అవస్థాభేదమును చూపునదైనను, అభినయమునకు బాధకము కలదై యున్నదేమో ?

ఎట్లన్న :—

'తనయప్ప సుధేష్ణకు మ్రొక్కెంజనువాఁడు'

'దానిదెస దగిలిన దృష్టి యెట్టకేలకుం దిగిచికొని చని యద్దేవికిం బ్రణమిల్లి.'

'తను సంభావించునెడ నాతడప్పకు బాంచాలిం జూపి వేగపడి యిట్లనియె.'

కావున కీచకుడు డెచ్చటను కూర్చొనినటుల కవి సూచనలేదు. కాని ;

'వే పిలిపింపు కోమలిన్.
అనుచు దైన్యంబునొందెడి నాననంబు
తోడ దిగ్గనలేచి యత్తోయజాక్షీ
చరణపీఠంబుకడఁ జక్కఁజాఁగి మ్రొక్కి
యున్న నద్దేవికనుఁగొని చిన్నఁబోయి.
తన తమ్ముని నల్లనెత్తినది.'

కీచకుడు 'దిగ్గనలేచి చరణపీఠము' కడ మ్రొక్కుటచే సుదేష్ణాకీచకులు ఉపవిష్టులైయుండుట స్పష్టము. ఈసూచన తిక్కన యెచ్చటనైనచేసియుండి యుండునుగదా ! పరిశీలింతము.

కీచకుడు 'చని యద్దేవికిం బ్రణమిల్లిన......... కాంచనపీఠము బెట్టగబంచి'నది గావున సుదేష్ణ కూర్చుని యుండుట ద్యోతకమగుచున్నది. నమస్కరించు తమ్ముడుగాన లేవనక్కరయుండదు. ఒకవేళ ఆమె నిలబడియుండగా ఆతడు నమస్కరించియుండ గూడదా ? అను సంశయమునకు తిక్కన యెడమివ్వక కీచకుడు 'అత్తోయజాక్షీ చరణపీఠంబు కడఁ జక్కఁ జాఁగి మ్రొక్కి'నటుల వ్రాసి ఆద్యంతములలో సుదేష్ణ కొలుకదల్చలేదని స్పష్టముచేసినాడు.

కావున కీచకుడు కూర్చొని మరల నమస్కరించుటకు లేచుట సూచించినాడు. ఎట్లన - వెనుఁబడు (వెను+పడు) వెనుకకుపడు-అనగా (తాను వలచిన కాంత తిరస్కరించుటచేతను - ఆమెను బలాత్కరించుటకు దుర్బలుడై యుండుటచేతను - ఈఅపరాధమును చూచుచున్న అప్ప తన్ను ఓదార్పకపోవుటచేతను మనోవైకల్యముగలవాడై) 'కూలఁబడెను.' కావున అసందర్భప్రలాపములు పలికెను. అనుట యుక్తమా ? లేక. 'దిగ్గినలేచి, అనుటచే ఎప్పుడో ఒకప్పుడు కీచకుడు కూర్చుండి లేచెనని తలంచుటకు ఈపదసూచన చాలునా ? కావున, ఈ సంశయములు సప్రమాణముగా ప్రాజ్ఞులు నిర్ణయించవలెను; ఈ ఘట్టమును విమర్శించి ప్రయోజనము లేదు.

౨. వినోద కథ

# కళ్లపిళ్లయ్యగారి కస్తూరికథ

ఒక ఊళ్లో ఇద్దరు వెలమసోదరులు ఉండేవారు. వారు చాలా పేదవారు. అయినా వెలమలు కాబట్టి చాలాగుట్టుగా ఉంటూ పైకి మాత్రం కబుర్లలో తమగొప్పతనాన్ని ప్రకటించుకుంటూ వుండేవారు. అందులో పెద్దవాడికి దివానంలో ఉద్యోగం. ఉద్యోగం అన్న పేరేగాని జీతం నియామకం లేదు. ప్రభువుగారికి తోచినప్పుడు ఏదోతోచినంత యిస్తూవుండేవారు. చిన్నవాడికి ఏఉద్యోగం లేనికారణంచేత ఇంటిదగ్గరే ఉండి వంట మొదలైన ఇంటిపనులు చేస్తుండేవాడు. ఇలాఉంటూండగా ఒకనాడు పెద్దవాడు 'మామూలుగా దివానానికి వెళ్లినాడు. రెండోవాడు ఇంటివద్ద జొన్నఅంబలి కాస్తూవున్నాడు. అంబలికుతకుత ఉడికి గిన్నెమూతి దాకావచ్చింది. దింపినాడు. ఉప్పువెయ్యడం తరువాయి. ఉప్పుబుట్టతీరాచూసే సరికి ఉప్పులేకపోయింది. పొరుగింటికి పోయి అప్పుతేవడానికి వెలమపౌరుషం వప్పుకోదు. బజారునుంచి కొని తేవడానికి చేతిలో చిల్లిగవ్వకూడాలేదు. కాబట్టి అతడు ఈవిషయం అన్నతో చెప్పడానికి దివానంలోకి పోయినాడు. అన్న చాలామంది మధ్యనుఉండడంచేత 'అంబలి పొంగువచ్చి కుతకుతలాడుతోంది. అందులోకి. ఉప్పులేదు' అనిచెప్పడానికి తమ్ముడికి వీలులేకపోయింది. అప్పుడు అతగాడు చమత్కారంగా అన్నతో కళ్ళపిళ్ళయ్యగారు కంతానికొచ్చినారు, కస్తూరి తెమ్మంటున్నారు' అన్నాడు. ఇట్టి పరిభాషమాటలు వారికి అలవాటుకాబట్టి అన్నకు ఆమాటలు అర్థమైనాయి. ఇన్నిజొన్నలు పట్టుకుపోయి బజారునుంచి ఉప్పుతెమ్మనమని చెప్పాలనుకున్నాడు. కాని అట్లాచెప్పేస్తే తమగుట్టు బయలుపడిపోతుంది. కాబట్టి అన్నకూడా చమత్కారంగా 'మూలదొంతిలో ముత్యాలహారాలున్నయి అంగిడికిపోయి మార్చుకురా' అన్నాడు. దీనిఅర్థంగ్రహించి తమ్ముడు ఇంటికి పోయినాడు. కాని ఈలోగా కుక్కఒకటివచ్చి ఆ అంబలిగిన్నెను మూతితో కలచుకొనిపోయింది.తమ్ముడు తిరిగి దివానంలోకి పోయి ఈసంగతి 'శునకనాథయ్యగారువచ్చి కళ్ళపిళ్ళయ్యగారిని కాజేశారు' అని చమత్కారంగా అన్నతో చెప్పినాడు. అందుమీద అన్న 'అంతానా? కొంతేనా?' అని ప్రశ్నించాడు. గిన్నెకూడా పోయిందని తెలియచేయడానికి తమ్ముడు అన్నతో 'కంఠమాలయ్యగారుకూడ వారివెంటనే పోయినారు' అన్నాడు. ఎంత అన్యాపదేశంగా చెప్పుకున్నా ఇది వింటూన్నవారిలో కొందరు బుద్ధిమంతులు నిజంగ్రహించి ప్రభువువారికి ఈ అన్నదమ్ములస్థితిని గూర్చి విప్పిచెప్పగా వారికి దయపుట్టి అప్పటినుంచి అన్నకు నెలనెలకు జీతం నియామకంగా ఇచ్చే ఏర్పాటు చేశారు.


## ఆంధ్రభూమి

చందా వివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | ... రు. | ౧-౮-౦ |
| విడిసంచిక | ... రు. | ౦-౨-౦ |

# గర్భస్రావపు హక్కు

['గర్భస్రావము చేసికొను హక్కుండవలెను' అను శీర్షికతో 'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికయందు శ్రీమతి బి. వెంకటలక్ష్మమ్మగారు వ్రాసిన వ్యాసమును చర్చించుచు మాకార్యాలయమునకు వచ్చిన అభిప్రాయములయందు నాలుగింటిని గతమాసపుసంచికలో ప్రచురించి యుంటిమి. ఇపుడు మఱి నాలుగు అభిప్రాయములను ప్రచురించుచున్నాము. పైమాసమున మఱికొన్ని ప్రచురించి అంతతో ఈ విషయమును సమాప్తముచేయుదుము.]

౫

పాము మున్నగు క్రూరజంతువులు కొన్ని తమబిడ్డలను తామే తినివేయునను ప్రతీతి కలదు. జ్ఞానవిషయములో నీ క్రూరజంతువులకంటె అధికులగు మానవులుకొందఱు తమ బిడ్డలు జన్మనొందక పూర్వమే వారిని కడతేర్చు నుపాయములను కనిపెట్టి లోక మాయుపాయముల నుపయోగించుకొనవలెనని ప్రచారము గావించుచున్నారు. సర్పాది క్రూరజంతువులు కూడ సైన్సును నేర్చుకొనుచో నవి స్వీయశిశుహననవిషయమున నీమానవులతో తుల్యములు కాగలవు. అంతవఱకును నాజంతువులు బిడ్డలను చంపుటకై యవి జన్మించువఱకును వేచియుండవలసినదే. ఆసమయ మేతెంచువఱకును స్వీయశిశుహత్యావిషయములో నీ ఘాతుకజంతువులు కూడ నీమానవాగ్రణుల కగ్రతాంబూలము నంగీకరింపవలసినదే. గర్భస్రావము గావింపవచ్చునని చెప్పువారిలో చాలమంది కొక యపోహయున్నట్లు కాన్పించును. గర్భములోనుండగ పిండమునకు ప్రాణములేదనియు, జన్మించిన పిమ్మటనే ప్రాణముండుననియు, కాన జన్మింపకుండ గర్భములోనే పిండమును పరిమార్చుట దోషముకాదనియు వీరి భావమైనట్లు వీరివ్రాతలవలన తెలియుచున్నది. ఈభావము శరీరశాస్త్రమునకును హిందూధర్మశాస్త్రమునకును గూడ విరుద్ధమేయని వీరు గుర్తింపవలెను. గర్భములోనున్నపుడు కూడ శిశువునకు ప్రాణముండును. హృదయముకూడ కొట్టుకొనుట విననగును. కావుననే గర్భిణికి 'దౌహృదిని' యను పేరుగలదు. 'రెండుహృదయములు కలది' అని దీనికర్థము. కనుక బిడ్డపుట్టిన పిమ్మట చంపుట యెట్లు దోషమో గర్భములోనుండగ దానిని చంపుట కూడ నట్లే దోషమని తేలుచున్నది. వితంతువులు, అవివాహితలు మున్నగు జవరాండ్రకు బిడ్డలుపుట్టుచో వారికి సంఘములో నపకీర్తి వచ్చునుగాన నాబిడ్డలను వారు జన్మకుముందుగనే రహస్యముగ చంపుకొనవచ్చునని గర్భస్రావ వాదులు చెప్పుచున్నారు. ఒకని కపకీర్తి కలుగకుండుటకై మఱొక ప్రాణిని చంపవచ్చునను సూత్రము నింతవఱకు నేదేశముగాని యేమతముగాని యంగీకరింపలేదు. ఇకమీద నంగీకరింపవలెనని కూడ వివేకముగలవారెవ్వరును చెప్పరు. తల్లికిష్టములేకుండ పుట్టిపెరిగినవారు దేశమునకును తమకును గూడ నుపయోగింపరు కాన నట్టివారిని కడతేర్చవచ్చునని గర్భస్రావవాదులు చెప్పుచున్నారు. ఒకవ్యక్తి దేశమునకును తనకును నుపయోగింపనివాడని మఱొకడు నమ్మినంతమాత్రమున వానిని

చంపివేయుటకు వినికి హక్కుండుచో మనలో ప్రతివ్యక్తికిని మఱొకవ్యక్తివలన మరణము తప్పకవచ్చును. ప్రతి మనుష్యుడును నెవనికో యొకనికి వ్యర్థజీవిగ గన్పట్టకమానడు. ప్రస్తుతము గర్భస్రావము నేరముగ పరిగణింపబడుటచే గర్భస్రావము గావించుకొన దలచువారు గచ్చాకు పుచ్చాకు వైద్యములచేసికొని తమయారోగ్యము చెడగొట్టుకొనుచున్నారనియు, గర్భస్రావము నేరముకాదని ప్రకటించుచో వారు బహిరంగముగ ఘనవైద్యులచే స్రావము గావించుకొందురనియు గూడ కొందఱు చెప్పుచున్నారు. దొంగతనము నేరముగ పరిగణింపబడుటచే దానిని రాత్రులందు రహస్యముగ చేయబోవువారికి పాము, తేలు మున్నగువాని వలన బాధకలుగవచ్చును గాన వారికేబాధ గలుగకుండుటకై దొంగతనము నేరముకాదని ప్రకటింపవలెనని కోరుట యెట్లుండునో యీకోరికయు నట్లే యున్నది. నేరముచేయువారికి బాధరాకుండుటకై నేరమునకు దోషసంజ్ఞను తీసివేయవలెనని చెప్పుట లోకములో పాపమును ప్రత్యక్షముగ ప్రోత్సహించుటయే కాని మఱొకటికాదు. ఏవో సాకులనుజెప్పి పవిత్రమగు మానవజీవితమును పరిమార్చి భ్రూణహత్యవంటి ఘోరదోషమును ధర్మ్యకృత్యముగ సమర్థింప యత్నించు స్త్రీపురుషులు బయలుదేరుటకూడ భారతమాతయొక్క యాధునిక దౌర్భాగ్యములలో నొకటియని నాయభిప్రాయము.

—జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

౬

గర్భస్రావమునకు హక్కునిచ్చుట వ్యభిచారమునకు దారిచూపుటయే. కారణమేమనగా గర్భస్రావము కూడదని శాసించుటచేతనేకదా వితంతువులును, భర్తచేత విడువబడినవారును గర్భముకలుగునను భయముచే కొంతవఱకు వ్యభిచరించుటకు భయపడుచున్నారు. అట్టిభయమును పోగొట్టుకొనుటకు నీహక్కు నిచ్చినయెడల వారు నిర్భయముగ నిదివరకుండెడి జంకు కొంకులు లేక వ్యభిచరించెదరనుటకు సందియముండునా ? అప్పుడు ఇట్టి స్త్రీజాతికిని వ్యభిచారముకొఱకు ప్రత్యేకింపబడిన వేశ్యాజాతికిని భేదముండునా ? నేటి యువకులకు నిట్టి యవకాశము కల్పించి యీహక్కు నిచ్చినయెడల ఆమరణాంతము ఈసంసారమహాసాగరము నీదుట కెవ డిష్టపడును? ఈహక్కు నిచ్చినమరుచటిరోజునుండియు యువతీయువకులు వివాహమనుమాటయే మరచిపోవుదురు గదా? అందుచే నీహక్కునకును వివాహమునకును సంబంధ మెక్కువగా కనుపించుచున్నది. కనుక వ్యాసకర్త్రియొక్క అభిప్రాయము భారతభూమియందు వివాహములుండకూడదనియు, లోకము పతితముకావలయుననియు అయినయెడల నీహక్కును కోరెడి యీమె చాలాప్రశంసనీయురాలు.

—నేతి కామేశ్వర శాస్త్రి.

౭

గర్భస్రావంచేసుగునే హక్కు వుండి తీరాలి. అది ఎల్లాటివారికీ? ఎక్కువ సంతానం గలిగి తిరిగీ గర్భంధరించినట్టిన్ని, సుకుమారులవడంచేత తమదుర్బలతో న్న ప్రసూతి కష్టా

నికి గురిచేయభయపడేటట్టిన్ని, ఆరోగ్యభంగభయము, దారిద్ర్యభయము కలిగిన సభర్తృక స్త్రీలకే వుండాలి. భార్యాభర్తల కిద్దరికీ సంతానం అనవసరం అనే అభిప్రాయం వున్నపుడు అట్టిస్త్రీకిన్ని, చిన్నతనంలోనే అనగా 13–14 సంవత్సరాల వయస్సుకే గర్భమువచ్చిన సభర్తృకస్త్రీలకున్నూ కూడా ఈహక్కు వుండాలి. అంతేగాని వితంతువులకు ఈహక్కు వుండాలనడంలో నే నేకీభవించలేను. ఎంచేతనంటారా? ఈహక్కు వారికివ్వడం వారెని పూర్తిగా వ్యభిచారంచెయ్యండమ్మా అని చెప్పడమే.

—దువ్వూరి సూర్యనారాయణమూర్తి.

౮

సంఘమర్యాదకు విరుద్ధమగునదియు ఆచారములను తిరస్కరించునదియు అవినీతిదాయకమైనదియునగు గర్భస్రావమును చేసుకొనుస్త్రీలు యిప్పట్లో 2 జాతులు విగతభర్తృకలు, సభర్తృకలు అని. ఈ రెండుజాతులలో 4 తెగలు. ఈ నాల్గు తెగలలో వితంతువులు మొదటిజాతివారు. ఇంక రెండవజాతిలో సభర్తృకలు 3 తెగలు (1) భర్తచే విడువబడిన వారు. (2) భర్తచేగాని వ్యభిచారంవల్లగాని గలిగే గర్భమును (ఒకరిద్దరు పిల్లల తరువాతమాట. ఎక్కువపిల్లలు పుట్టితే ఆస్తివిభాగములు చిన్నవై పిల్లల సౌఖ్యమునకు కొరతగల్గునను భయముచే) విచ్ఛిన్నముచేసుకొనువారు. (3) ముసలితనమున గర్భముగల్గిన నవ్వుబాట్ల పాలగుదుమని గర్భము విచ్ఛిన్నముచేసుకొనువారు. ఈ 4 తెగలలో మొదటిజాతి స్త్రీలున్ను రెండవజాతిలోని మొదటి తెగ స్త్రీలున్ను ఎక్కువగా జారత్వంవల్ల 4, 5 నెలలు గర్భము మోసి పిదప విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. యిట్టి అవినీతి దాయకమై, ఆచారవిరుద్ధమై, సంఘదూష్యమై, అనారోగ్యమైన గర్భస్రావములు ఎక్కడో అరుదుగా రహస్యముగా జరిగిపోతున్నవి. యిట్టి రహస్యవ్యవహారము, రచ్చకు రావలెనని అట్టి హక్కు శాసనపూర్వకముగా రావలెనని కోరుట వ్యభిచారవృద్ధికి ప్రోత్సాహసూచకముగా చూపెట్టుచున్నది. యిట్టి జారత్వమును ప్రోత్సహించుట జాణతనమనక మరేమనవలయును? సంఘదూష్యమునకు వెనుకాడకున్నను రాజదండనభయముచేనైన వెనుకాడు స్త్రీలు యిట్టి హక్కు అమలులో వున్నయెడల 5–6 మాసముల కొకతూరి గర్భస్రావము చేసుకొనరా? అప్పుడు వారికేమైన భయముగాని, అభిమానముగాని వుండునా? అందువల్ల దేశమున శిశుహత్యాపాతకము ఎంతవృద్ధియగును? అట్టి అవినీతికరమగుపని అనారోగ్యమని బోధించుటకుమారు హక్కుకై పోరాడుట కడుంగడు సాహసము. యిట్టి శాసన మమలులో నుంచుట అనారోగ్యకరమని ప్రభుత్వమువా రెరుంగరా? సుగుణముల నాపాదించు కొరకు, స్త్రీల అభివృద్ధికొరకు ఏర్పడ్డ స్త్రీవిద్య యిట్టి కొరమాలిన అవినీతి హక్కులకు వినియోగింపబడ్డదని భారతనారీమణులను, స్త్రీలెరుగక కోరిన హక్కులకు పురుషులు చేయూత యిస్తున్నారని హిందూపురుషులను యితరదేశీయులు నవ్వరా? కాబట్టి నాశనకరమును, పాపభూయిష్ఠమును ఐన యిట్టి హక్కుకు ప్రభుత్వమువారు సమ్మతింపకుందురుగాక! పవిత్ర హిందూ స్త్రీ పురుషు లిట్టి కోరికకు దూరముగా నుందురుగాక!

—పసుమర్తి వెంకట్రామయ్య.

# ఇన్స్యూరెన్సు విషయములు

## ఆదర్శప్రాయుడైన భీమాయేజెంటు

(నూటఒక్కదినములపర్యంతము దినమున కొకపట్టాచొప్పున విక్రయము.)

మోటారు రాజు హెన్రీఫోర్డు నామము వినని వారెవ్వరు? అతని పట్టణము డెట్రాయిట్. ఆడెట్రాయిట్ పట్టణమున స్కాట్ జాతికి చెందినయువకు డొకడు నివశించుచుండెను. అతని నామము ఛార్లస్ ముర్రే.అతడు ఇన్సూరెన్సుఏజెంటు.

ప్రపంచమున ఎంతమంది ఇన్సూరెన్సు ఏజెంట్లులేరు? కోటానకోట్లుగా నుండిన ఇన్సూరెన్సుఏజెంట్లలో అతని విషయమున ఏమైనప్రత్యేకత ఉన్నదా? ఉన్నది కావుననే అతని ప్రశంస ఇచట చేయనైనది.

డెట్రాయిట్ నందలి హెన్రీఫోర్డు మోటారుప్రపంచమున రికార్డు కొట్టినాడు. డెట్రాయిట్ నందలి ఛార్లస్ముర్రే ఇన్సూరెన్సు ప్రపంచమున ఇటీవల రికార్డుకొట్టినాడు. కొట్టి ఆదర్శప్రాయుడగు భీమాయేజెంటు ఆయెను.

నూటఒక్కదినములు తెంపులేక ప్రతియొక్కొక్క దినమును అతడు కనీసము ఒక్కొక్కభీమాపాలసీనైన అమ్మువాడు. కనీసము ఒక భీమాపాలసీనైన దినమునకు అమ్మకుండ నూటఒక్కదినములు తెగనివ్యాపారముచేసిన ఇన్సూరెన్సుఏజెంటు ప్రపంచచరిత్రలో మఱియొకడులేడు. నూటరెండవదినమున మాత్రము అతడు భీమాపాలసీని ఒక్కదానినైన అమ్మలేక పోయినాడు.

నూటరెండవదినము వచ్చువఱకును గతించిన దినములన్నిటియందును దినమునకు కనీసము ఒకటైన భీమాపాలసీని అమ్ముచువచ్చినాడు. ఇది యెట్లు అతడు చేయగలిగినాడు? ఆముఖ్యవిషయమును తెలిసికొనుట యందే మన మనములు లగ్నములై యున్నవి.

తన మిత్రులలో, పరిచితులలో, బంధువులలో భీమాపట్టా కొనగలవారని తనకుతోచిన నూటయేబదిమంది నామములను పట్టికగా అతడు మొదట తయారు చేసినాడు.

పిమ్మట తనమిత్రులకు లేఖలు వ్రాసినాడు: భీమాపట్టాలు కొనగలవారి నామములు తెలుపమని. కాని ఆమిత్రులవలన కొద్దిసాయము మాత్రము వచ్చినది.

అప్పుడు వారిని తాను స్వయముగ చూచుటకు దొరకొనినాడు. ఉత్తరములకంటె ఈపద్ధతి బాగుగా పనిచేసినది. ఒక్కొక్కరు తమకుతోచిన కొన్నికొన్ని పేళ్లుసూచించిరి–

మఱునాడు చేయవలసిన పనినిగూర్చి అతడీరాత్రియే నిశ్చయమొనర్చుకొనువాడు– తన కాలమున ప్రతి ఒక్కగంటను అత డుపయోగించుకొనువాడు– దినమునకుగల ఇరువదినాలుగు గంటలలో ఎనిమిదిగంటలకు తగ్గకుండను పండ్రెండుగంటలకు మించకుండను అతడు పనిచేయువాడు– ఆదివారములందుగాని, సెల

వుదినములందు గాని పనిచేయువాడు కాదు—

ఒకసారి ఆతడు ఉదయము ఆరుగంటలకే ఒకభీమాపట్టాను అమ్మగలిగెను— ఎవరికి? తనకు పాలుఅమ్మువానికి— ఎంత మొత్తమునకు? రెండువందల పౌనులకు. తాను స్నానపు దుస్తులలోనుండగా ఆతని కాభావము పొడచూపెను— తోడనేవచ్చి తనపాలవానికి నచ్చచెప్పి పాలసీని విక్రయించెను—

'జీవితభీమా వ్యాపారమున ప్రతివాడును కొనుగోలుదారే' అని ముర్రే చెప్పును— ఆతడొకసారి ఒకమాన్యుఫాక్చరర్‌ను చూడవేచియున్న కాలమున అచటి టైపిస్టునకొకనికి ఒక భీమాపట్టాను విక్రయించెను—

తాను నచ్చచెప్పుట చేత ఎన్నిపట్టాలు విక్రయింప గలిగెనో ఇతరులు చెప్పునది లెస్సగ వినుటచేత కూడ నాతడన్ని పట్టాలు విక్రయించెను— వారివారి కుటుంబ పరిస్థితులను గూర్చియు, వారివారి ఆర్థిక సమస్యలను గూర్చియు తనతో సావకాశముగ చెప్పుకొననిచ్చువాడు. పిమ్మట నెమ్మదిగ వారివారికి అనువైయుండు పాలసీని సూచించి వారిచే కొనిపించువాడు.

తాను పోయిన చోట తనకు చేయబడిన స్వాగతమును ఆతడెప్పుడు చాలసేపు ఉండిపోవుటచేత పాడుచేయలేదు. కూడినంతకాలలముఉండి అప్పటికి వెడలిపోయి తిరిగి మరియొకప్పుడువచ్చువాడు. ఇన్సూరెన్సుఏజెంట్లు ఈవిషయమును తఱుచు విస్మరింతురు. తన రాకచేగాని, తనఉనికిచేగాని ఎవరింటియందును ఎట్టి చీకాకుగాని చీదరగాని కలుగకుండునట్లు అతడు మిక్కిలి మెలుకువ వహించువాడు.

మొదట నాతడు ఒకరైల్వేస్టేషన్‌లో టిక్కట్లుఅమ్మువాడుగా నుండినాడు. విశేషమగు విక్రయము లేకుండుటచే వస్తువిక్రయ రహస్యములను బోధించు పుస్తకములను, పత్రికలను కొని చదువనారంభించెను. భీమాపట్టాల విక్రయమునకు దొరకొన నిశ్చయించెను. రెండు నిండుసంవత్సరములు ఇన్సూరెన్సు విషయక గ్రంథములను పఠించెను. వలయుజ్ఞానము కలిగిన పిమ్మట రైలుటిక్కట్టు అమ్ము ఉద్యోగమునకు రాజీనామా యిచ్చి ఒకానొక ఇన్సూరెన్సు కంపెనీయందు ఏజెంటుగా కుదిరెను.

ఆతడు ఇన్సూరెన్సు ఏజెంటుగా పురుషప్రయత్నముచేతనే జయమందెను. తానుచేయవలసిన పనికి గ్రంథపఠనముచే నాతడు లెస్సగ తయారయ్యెను. తయ్యారై కార్యరంగమున ప్రవేశించి ఆతడు ఇన్సూరెన్సు విక్రయమును హుటాహుటిగా గావించెను.

ప్రతి ఇన్సూరెన్సు యేజెంటును పొంద ఆశింపదగు నొక ఆదర్శమును ఆతడు యేర్పఱచెను. దినమునకు కనీసము ఒక్కొక్క పట్టాచొప్పున నూటఒక్క దినముల వఱకు తెగని ఇన్సూరెన్సు విక్రయము.

ఆంధ్రభూమి : ఇన్సూరెన్సువిషయాలు.

'మన వార్తాపత్రికలన్నింట్లోను, భీమావ్యాపారం గురించి తప్పకుండా ప్రతి సంచికలోను వ్యాసాలు ప్రచురించే పత్రిక ఈఒక్క 'ఆంధ్రభూమి' మాత్రమే. మార్చిసంచికలో జీవితభీమా అనగా నేమి' అను వ్యాసము ఏజంట్లు పట్టాదార్లు అందరు చదువతగింది. చాలా వార్తాపత్రికలకు ఆర్థికసహాయం భీమా కంపెనీలవల్లనే జరుగుతూంది. కాని ఈపత్రికలు మాత్రం భీమానుగురించి ఏవిధమైన ప్రచారం చెయ్యవు. ఇతరదేశాలయందు ఎక్కడకూడా ఈవిధంగా లేదు. "ఆంధ్రభూమి" సంపాదకులు ఈవిషయమందు మార్గదర్శకులు, పెద్దపెద్ద వార్తాపత్రికల యజమానులు వీరిదగ్గర ఈవిషయం నేర్చుకోవాలి. భీమాకంపెనీలన్నియును 'ఆంధ్రభూమి' సంపాదకులకు సంపూర్ణమైన ప్రోత్సాహంఇయ్యాలి.' —ఆపద్బంధు.

# ఆంధ్రభూమి బుక్ డిపో—వేపేరి, మదరాసు

## ఆంధ్రరమణీమణులు — 96 పుటలు : మొదటిభాగము — తొమ్మిదిఅణాలు.

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగు తెఱవల జీవితములు తేటతెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమానులు ఆదరింపదగిన గ్రంథము.

## దేశీయగీతములు — 40 పుటలు — రెండు అణాలు.

శ్రీగరిమెళ్ళ సత్యనారాయణగారిచే కాంగ్రెస్ స్వర్ణోత్సవ సందర్భమున రచింపబడిన చక్కని గీతముల సంపుటి. శ్రీగార్లదిన్నె రామేశ్వరరావుపంతులు (బి. ఏ. బి. యల్; యమ్.యల్. సి) గారి పీఠిక.

## తర్కసంగ్రహము — పోకెట్ సైజ్ — ఒక రూపాయి.

తర్కశాస్త్రపారంగతుఁడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ సంస్కృతములో రచియించిన గ్రంథమునకు ఆంధ్రతాత్పర్యమును రచించి చరకమతదీపికొఖ్యాయుర్వేదమతవివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి, యల్.ఐ.యమ్.; హెచ్. పి.ఐ.యమ్ గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమయిన పదార్థవిజ్ఞానపటము కూడ కలదు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈగ్రంథము ప్రతి ఆంధ్రాయుర్వేద వైద్యునకు ఎంతయు ఉపకరించుటయేగాక ఆంగ్లలాజిక్ విద్యార్థులుకూడ చదువతగినది.

## కేయూరబాహుచరిత్ర — 88 పుటలు — ఎనిమిది అణాలు.

మంచనమహాకవి పద్యకావ్యమునకు వచనము. నడుమనడుమఁ బ్రసక్తానుప్రసక్తిగ జొప్పింపబడిన నీతిగర్భితములగు కథలతో నిది బాలబాలికలకు పఠనయోగ్యమై యున్నది.

## వ్యాసావళి — 82 పుటలు — ఎనిమిది అణాలు.

ఉభయభాషాప్రవీణ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు రచియించిన ఐదుసారస్వతవిమర్శక వ్యాసముల సంపుటి. సీతమ్మ శోకము : పాపరాజు ; గురుజాడ వాల్మీకి, రెండు నక్షత్రాలు, 'శబరీ'సమాలోకనం, 'వకుళమాలా'పరిశీలనం—అని వ్యాసశీర్షికలు.

## రసరత్నాకరము — 100 పుటలు — , రూపాయి.

రసఖండము. నిత్యనాథసిద్ధ రచితము. సంస్కృతశ్లోకములకు వైద్యవిద్వాన్ యస్. కృష్ణమాచార్యులుగారు, బి.ఏ, వ్రాసిన తెనుగు తాత్పర్యముగలది. రసవైద్యము విశేషముగ నాశ్రయించు ఆంధ్రదేశవైద్యుల కిది యెంతయు నుపయోగకరమైనది.

# తెలుగు దీప్తి

(రచయిత:) వంగూరి రామారావు.

అంజలిడుదామా
హారతిద్దామా
తెలుగుదీప్తిని దలంచి
దీప మెడదామా ॥
కృష్ణాస్రోతస్వినియు
గోదావరీతల్లి
విమలాంబువుల నిచ్చి
వర్ధిల్లు మనుచుండ॥ అం॥
తెలుగుబాసకు వన్నె
తెచ్చి ప్రోదొనరించు
రాజరాజనరేంద్రు
రమ్యకీర్తినిగొల్చి ॥ అం॥
ఆదికవి నన్నయ్య
ఆంధ్రరాణిసృజింప
తిక్కయజ్వా జగాన
తేజరిల్ల గజేయ ॥ అం॥
కాకతీయులనాఁటి
కాంత రుద్రమదేవి
ఆంధ్రయోషల యంత
రమ్యంతవివరింప॥ అం॥
పల్నాటిసీమలో
ప్రభవించి మిన్నెక్కి
బాలచంద్రులగాంచి
పరిఢవిల్లెడి కీర్తి ॥ అం॥
కవిసార్వభౌము బం
గారు గంటము మ్రొక్కి
సహజకవి పోతన్న
సారస్వతము నెంచి ॥ అం॥
తెలుగు బాసయు,-సౌరు
చెలువమ్ము, పరువమ్ము
వ్రాతమగుచును, మొక్క
వోని, శౌర్యాగ్ని కీటు ॥ అం॥
సంగీత, సాహిత్య
శాస్త్ర విజ్ఞానముల
సాటిలేని పవిత్ర
స్థానమున గలటీవి ॥ అం॥


## మొమ్మాయి - జీవన్

శ్రేష్ఠమైన హిరానీ మొమ్మాయితో మహత్తర శక్తిమంతములైన అనేక ఓషధులు చేర్చి చేయబడినది.

రక్తవృద్ధిని, ధాతుపుష్టిని, జననత్త్వములను కల్గించును. శుక్రనష్టము, శీఘ్రస్ఖలనము, కీళ్ళ నొప్పులను నివారించి వజ్రకాయము నొసంగును.

(20 రోజు ... సీసా 1-కి రు 2-0-0.
పోస్టేజీ ప్రత్యేకము.

ఆంధ్ర ...కల్ అండ్
ఫార్మస్యూటికల్ వర్క్సు. (రిజిస్టర్డు).
గాంధినగరం, బెజవాడ.

## "స్టార్ షాలో"

అమోఘమైన తేలుకాటు మందు. ప్రతి కంటియందును 2 బిందువులు వేసిన వెంటనే, మంటలుతగ్గి విషముదిగి పోవును. బుడ్డి. అ. 2

## 'హనుమాన్' టూత్ ఏక్ బామ్

యెట్టి పల్లునొప్పియైనను కొంచెము దూది ఔషధములో తడిపి నొప్పిగలచోట యుంచిన 5 నిమిషములలో గుణము. వేనకువేలుఖర్చు. యోగ్యతాపత్రముల పడించినది. బుడ్డి.అ.4.
ప్రతియూరియందును ఏజంట్లు కావలయును.

సోల్ ఏజంట్లు :—
డక్కన్ ట్రేడింగ్ కంపెని, హిందూపురం.



స్త్రీలు పూజింపబడుచోట దేవతలు క్రీడింతురు.



# మహిళాలోకము

## మీకు ఇట్టి కూతురు కావలయునా?

'ఎవిలినా' అని ఒకనవల. ప్రపంచము నందలి వివిధసారస్వతములందలి నవలలలో విశేషప్రజామోదమును బడసి అతిప్రఖ్యాతి నందినవానిలో 'ఎవిలినా' ఒకటి. దానిని రచియించినది మిస్ బర్నీ అనుకన్య. ఆగ్రంథము వ్రాయుసరికి ఆమెకు పదునేడేండ్లయిన సరిగ నిండలేదు. దానినామె తనతండ్రి యెఱుగకుండ రచియించి మారుపేరుతో ప్రచురించినది.

ఆనవల ప్రచురింపబడిన క్రొత్తలో ఆమె తండ్రి డాక్టర్ బర్నీ రాజధానీనగరమునకు బోయెను. అచ్చట అక్షరాస్యుడగు ప్రతివాని నాలుకమీదను 'ఎవిలినా' నవలనుగూర్చిన సంగతులే. అచ్చుకూటమునుండి వచ్చీరావడములో ఇంతగా జనుల నాకర్షించిన నవల మఱియొకటి లేకుండెను. డాక్టర్ బర్నీ ఆనవల నొకదానిని కొనెను. అది తనకుటుంబము వారికి విందుభోజనము కంటెను రుచిరమైయుండ గలదని అతడు సంతోషించెను.

మిస్టర్ క్రిస్పు అని డాక్టర్ బర్నీ స్నేహితుడు. అతని ఉనికి పల్లెపట్టగు ఛెస్సింగ్టన్. డాక్టర్ బర్నీ వ్యాపారరీత్యా రాజధానీనగరమునకు వచ్చినపుడే అతని కుటుంబమువారు చుట్టపుచూపుగా ఛెస్సింగ్టన్ నందలి క్రిస్పు గృహమునకు వెళ్ళియుండిరి. కాగా రాజధానీనగరమున తనపని ముగియుటతోడనే డాక్టర్ బర్నీకూడ అప్పటికి తనకుటుంబము వారుండిన ఛెస్సింగ్టన్ నందలి క్రిస్పు గృహమునకే వెళ్లెను.

క్రొత్తవారు వచ్చుటతోడనే విశేషములు ఏమి అని అడుగుట మానవసహజము. అట్లే ఇచటకూడ డాక్టర్ బర్నీ క్రిస్పుఇంటిగడపలో కాలుపెట్టీ పెట్టడములో నలుగురును ఆతనికి ఎదురుగా వచ్చి ఒక్కమొగిని విశేషములు ఏమి, విశేషములు ఏమి అని ప్రశ్నించిరి. అందుమీద ఆడాక్టర్ ఇట్లు చెప్పెను: 'చెప్పతగ్గ గొప్పవిశేషములు ఏమియులేవు. కాని ఇప్పు డామహానగరమంతయు క్రొత్తగా వెలువడిన ఒకానొక నవలను ప్రశంసించుటలో మునిగియున్నది. ఆనవలను మీకొఱకు ప్రత్యేకము కొనితెచ్చితిని.'

పెట్టెనుండి నవల బయటకుతీసి వారికి అందిచ్చినాడు. ఆనవలపేరు 'ఎవిలినా' అని చదువబడ్డది. మిస్ బర్నీకి మెఱుపుదెబ్బ తగిలినట్లయ్యెను. హృదయమున పొంగులు వెట్టుచు ఆనందము ఉద్ధతమందస్మితమై ఆమెవదనమును మార్చివైచెను. ప్రక్కనున్న వారిది గుర్తించి తనరహస్యమును గుర్తింపకుండ ఆమె అప్పుడు ప్రయత్నపూర్వకముగా తన మొగమును చాటువైచినది. పల్లెటిగృహములలో చుట్టముల, స్నేహితులరాక ఒక పెద్దసందడి. డాక్టర్ బర్నీ అప్పుడే వచ్చియున్నాడు. ఆసందడిలో మిస్ బర్నీ మొగమున పొడసూపిన ఆనందచిహ్నములను పొత్తిపట్టుటకు ఎవరికిని అవకాశము లేకపోయినది.

భోజనములైనవి. మిస్టర్ క్రిస్పు అందరు వినునట్లుగా పుస్తకపఠనముగావింపబడవల

యునని ప్రతిపాదించినాడు. తమ్ము ఆహ్వానించి ఆతిథ్యమిచ్చుచున్న ఆమిత్రుని ప్రతిపాదనకు అందరును వెనువెంటనే అంగీకరించినారు. ఎవరిమట్టుకు వారికే పుస్తకము ఎపుడు విందుమా అని తహతహగా ఉన్నది. కావున వాచకమున నేర్పరియగువా డొక డాగ్రంథము నందుకొని చదువనారంభించెను. ఆగ్రంథము పఠింపబడుచుండగా నడుమనడుమ శ్రోతలనుండి సెబాస్, సెబాస్ అను వాక్యములు తఱుచు వెలువడుచుండెను.

వారి ఆనందమునకు మేరలేకుండెను. ఆ గ్రంథము రచియించినవానిని ఎంతయో మెచ్చుకొనజొచ్చిరి. ఆగ్రంథరచనముద్వారా తమకింతటి అపూర్వానందమును కల్గించుచున్న వ్యక్తి తమకు సహశ్రోతయై యున్నదను విషయము అందు ఒక్కరికిగాని తెలియదు. తన గ్రంథము తన సమక్షమున తన కర్తృత్వము గోపనమైయుండగా పఠింపబడి ప్రశంసింపబడుచుండుటకు మిస్ బర్నీ ఆనందమున పరవశయై మిన్నుముట్టుచుండెను. ఇట్టి అదృష్టము ప్రపంచమున చనిన చనుచున్న అసంఖ్యాక గ్రంథకర్తలలో ఏ నలుగురు అయిదుగురు గ్రంథకర్తలకోగాని ఇంతవఱకు కలిగియుండలేదు. అందును పదునేడేండ్ల బాల తన బాల్యరచనము విషయమున—తన ప్రథమరచన విషయమున-ఇట్టి అపూర్వ సంఘట్టనమునకు నోచిపుట్టుట ఇదివఱకు జరగలేదు. ఇకమీదట జరగబోదు.

ఆగ్రంథపఠనసమయమునందంతయు ఆమె తనకు అంతంతకు అగ్గలమగుచుండిన ఆనందమును అణచిపెట్టి దాని చిహ్నములు ఏమాత్రమును తన వదనబింబముపై పొడసూపకుండ జాగ్రత్తవహించుట దుస్తరమయ్యెను. తుదకు ఆమె పట్టలేక పోయెను. అతిమధురమగు ఆనందమధువేయగుగాక ఇంక ఒక బొట్టునైన ఆమె హృదయపాత్రిక పట్టజాలని పరిస్థితి వచ్చెను. అప్పడామెలోచనగోళములందు ఆనందబాష్పాంబుఝరము చిమ్మలై చిలుపలై జాలై తరంగములై పోటుంబాటుగా ఉప్పతిల్ల జొచ్చెను. అంతట ఆమె ఒక్కొ-గంతునపోయి తండ్రి కంఠమునవ్రాలి తా నాగ్రంథపురచయిత్రియగుటను తెలుపుకొనెను.

ఆతండ్రి ఆనందమేమని చెప్పగలము? సంభ్రమాశ్చర్యములతో నాతడు చకితుడయ్యెను. ఆమె అప్పచెల్లెండ్రు అబ్బురపాటుతో గూడిన ఆనందమున వివశలయిరి. డాక్టర్ బర్నీకి తనతనయలు తెలివితేటలు కలవారని, వైదుష్యముకలవారని తెలియును. కాని ఇప్పుడు తాను వీనులవిందుగ వినిన నవలలో ప్రదర్శింపబడిన సునిశితమగు పరిశీలనాశక్తి, క్లిష్టపరిస్థితులను హృదయమునకు హత్తునటుల వివరించునేర్పు, అపూర్వమగు భావనాబలము, వర్ణనాచమత్కారము, శైలీపాటవము పదునేడేండ్లు నిండని తనకూతురు సృష్టింపగలదని ఆతడు తలంపలేక పోయెను. మఱియు ఆమె కలుపుగోలుతనమున అందరితో మెలగునదికాదు- ఎల్లవేళల ఏకాంతమున ఒంటరిపాటున నుండునది- అట్టి ఆమె మానవస్వభావమును ఇంతగా ఎటుల పరిశీలింపగలిగినదో? లోకానుభవము చాలనిదిగా, ఉత్త అమాయికమైనదిగా తాను భావించిన తనకూతురు పదునేడేండ్ల బాలప్రాయమున ఇంతటి అపూర్వవైదుష్యము ప్రదర్శించి లోకప్రఖ్యాతివహించిన నవలను రచించినందులకు ఆతండ్రి పొందిన ఆనందమునకు అవధి కనుగొనగలవా రెవ్వరు?

మీకు ఇట్టికూతురు కావలయునా?

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొను ప్రతికాముఖమున జిజ్ఞాస సలుపుటకును— ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము. —సంపాదకుడు.

### ౮౬. ఆశౌచవిచారము అనువృత్తము

అవివాహితలగు కన్యకలకు పితృజ్ఞాత్యాశౌచము లేదనుటకు గురుకులవాసముఁ జేయుచు వేదము నభ్యసించు బ్రహ్మచారికి నాశౌచములేదని శ్రుతిస్మృత్యాదులయందు స్పష్టముగాఁ జెప్పబడినట్లుగా నవివాహితలగు కన్యలకు నాశౌచములేదని చెప్పఁబడకపోవుటవలనను నిదియునుంగాక పితృగోత్రభ్రంశ కన్యలకు వివాహమునందు సప్తపదితో నగునను లిఖితస్మృతిప్రమాణమువలనను వీరును నాశౌచమునుబట్టియే తీరవలయుననిన ధర్మసింధువుయందు మృతాశౌచప్రకరణాంతమున 'అనుపనీతస్య్యా. నూఢకన్యాయాశ్చమాతాపిత్రుమరణఏవ దశాహాశౌచం ఇతర మరణేతునకిమపి' (ఉపనయనముగాని బాలునికి, వివాహముగాని కన్యకకుఁ దల్లిదండ్రుల మరణమునందే పదిదినము లాశౌచము- ఇతరుల మరణమునందేమియు లేదు) అను నీవచనమునకు గతియేమి? ఈ వచనము దేశాంతరవిషయమా? లేక ప్రామాణికముగాదా? కాక ప్రక్షిప్తమా?

### ౮౭. ఆశౌచవిచారము

విభక్తకుటుంబములోఁ జేరిన దాయాదులలోనెవరేని యపుత్రకుఁడు మరణించినపుడట్టివానికిద్దరు భార్యలుండుపక్షమున వారు పరస్పరముఁ గలహించుకొని యస్థిసంచయన దశాహాది కృత్యముల నాచరింపక యుండునప్పుడు దత్తోదకులైన విభక్త దాయాదులకు దశాహానంతరము శుద్ధి (అశుచినివృత్తి) గలదా? అప్పుడు వారు మాతాపిత్రాది ముఖ్య నైమిత్తిక శ్రాద్ధము లాచరించుటకుఁ బ్రత్యవాయములు ధర్మశాస్త్రరీత్యా (ప్రమాణతః) గలవా? అవియేవి? లేకున్న పిత్రాది ముఖ్యనైమిత్తికము లాచరించుటలో నష్టమేమి?

—పెరవలి లింగయ్యశాస్త్రి (విద్వాన్)

### ౮౧. దేవాలయములపై బూతు బొమ్మలు.

దేవాలయములమీద నశ్లీలవిగ్రహములను వేయుటకు శాస్త్రాధారమున్నట్లు కాన్పింపదు. ఈ క్రింది హేతువులచే నివి ప్రచారములోనికి వచ్చినట్లు కాన్పించును : (1) దేవాలయములమీద వేదాన్తబోధకములును, పురాణబోధకములును నగు విగ్రహములు వేయుట చూచుచున్నాము. దీనికి కారణము వేరుగ తెల్పనక్కరలేదు. దేవాలయ ప్రయోజనములందు నిట్టి యంశములను బోధించుట యొకటి. దశావతారములు మున్నగు విగ్రహము లీవిధముగ దేవాలయములపైకి వచ్చినవి. సృష్టిరహస్యములను తెల్పు విగ్రహములుగూడ నీగణములోనికే చేరును. అట్టివానియందు నీ యశ్లీలవిగ్రహములుగూడ తావును పొందియున్నవి. (2) దాక్షిణాత్యులకుగల కళాభిమానము శిల్పచాతుర్యము పూర్తిగ దేవాలయ నిర్మాణమందు వ్యక్తీకరింపబడినవనుటయందు నాశ్చర్యములేదు. దేవాలయమను పవిత్ర మిషచే వారు శిల్పకళానైపుణ్యమును ప్రదర్శించియున్నారు. అశ్లీలవిగ్రహములయందు కళచూపుటకు విశేషావకాశమున్నమాట వాస్తవము. దేవాలయములవంటి పవిత్రస్థలమున నవి గన్పఱుపబడుటచే ప్రేక్షకులకు సహజముగ శిల్పకళాచాతుర్యము గ్రహించుటకే బుద్ధిపుట్టునుకాని వానిని జూచుటచే నీచభావము లుదయింపవు. మఱొకస్థలమున నగుచో నట్లుకాదు. కళాప్రదర్శకములగు నశ్లీల విగ్రహములవలన దుష్ఫలితములు గలుగకుండ నుండవలెనన్నచో దేవాలయలే వానికి తగినతావని మన వారు భావించియుండవచ్చును. (3) విశేష వైభవముతో నిర్మింపబడిన దేవాలయములపైన దృష్టి పరిహారక విగ్రహములను వేయుట సహజమేకదా! అట్టి విగ్రహములు తఱచుగ నగ్నములుగ నుండును.

వాని వికృతరూపములే కొన్నిచోట్ల నీ యశ్లీల విగ్రహములై యుండవచ్చును.

—జటావల్లభుల పురుషోత్తము, ఎం.ఏ.

### ౮౩. గర్భస్రావానంతరకృత్యములు

ఏడుమాసముల చూలు మోసిన పిమ్మట గర్భస్రావమైనచో తిరిగి గర్భము ధరించుటకు కనీసము ఒక్క సంవత్సరకాలమైనను వ్యవధి ఉండవలెను. గర్భము నిలిచిన రెండుమూడు మాసములలోనే స్రావము సంభవించుచో తిరిగి గర్భము ధరించుటకు ఆరుమాసముల కాలవ్యవధియే విశేషమైనదని చెప్పవచ్చును. తిరిగి గర్భముధరించుటకు వేచియుండవలసిన ఈ వ్యవధికాలమును వృధాపుచ్చక ఆస్త్రీ ఆరోగ్యనియమములను లెస్సగ పాటించుచు, దినదినము దేహపరిశ్రమచేయుచు, గర్భకోశమునందలి వివిధములగు అవయవములు బాగుగా బలపడుటకు తగుశ్రద్ధ వహింపవలయును. శరీరమున ముఖ్యమైన లవణములును, విటమిన్ ఇ యు లోపించుటచే ఒక్కొక్కప్పుడు గర్భస్రావము కలుగవచ్చును. కావున ఇ విటమిన్ విస్తారముగగల ఫలములను, పచ్చి కూరగాయలను విస్తరించి తినవలయును. విదేశపు కూరలయందు లెట్యూసున విటమిన్ ఇ విస్తరించి యున్నది.

—ఆండ్ర రంగారావు, యల్.ఐ.యమ్.

### ౮౪. రంగాజీ, మోహనాంగి

ప్రాచీనాంధ్ర కవయిత్రులలో రంగాజీ, మోహనాంగి అను పేరుగలవారుండిరి. ఇందు రంగాజి మన్నారుదాసవిలాసనాటకము అను యక్షగానమును; మన్నారుదాసవిలాసము, ఉషాపరిణయమునను రెండు ప్రబంధములను రచియించెను. క్రీ.శ. 1633 మొదలు 1713 వఱకు తంజావూరు రాజ్యమునేలిన ఆంధ్ర నాయకరాజు విజయరాఘవుని ఆస్థానమున ఈ కవయిత్రిఉండినది. మోహనాంగి అను ఆంధ్రకవయిత్రి కీ.శ. 1509 మొదలు 1530 వఱకు హంపి విజయనగరమురాజధానిగా కర్ణాటాంధ్రసామ్రాజ్యమును పాలించిన కృష్ణదేవరాయల కూతురనియు, ఆమె మారిచీపరిణయము అను శృంగార ప్రబంధమును రచియించెననియు చెప్పుదురు.

### ౮౫. అభ్యంగస్నానము సౌందర్యనాశకమా?

తన సౌందర్యముచేత దేవలోకవాసియగు ఊర్వసిని కూడ భూలోకమునకు ఆకర్షించిన పురూరవ చక్రవర్తి అభ్యంగస్నానమువలన సౌందర్యము గోలుపోయెనను పురాణకథ యెచ్చటనులేదు. మానవదేహము శీఘ్రపరిణామి అనియు దాని సౌందర్యము అంతతో నశించునదిఅనియు చెప్పుటకు నిదర్శనముగా పురూరవ సంబంధమైన కథయొకటి కలదు. ఈ ప్రశ్నవైచినవారు బహుశః ఆకథనువిని దానిని తప్పుఅర్థము చేసికొనియుందురు. పురూరవ చక్రవర్తి రాజ్యపాలనము గావించుచుండ నాతనిరూపసంపదను మోహించి దివ్యాంగనలు భువికివచ్చుచుండిరి. స్వర్లోకమున తమకుమించిన రూపసంపన్నులు లేరని భావించుఅశ్వినీదేవతలు ఈసంగతివిని ఆశ్చర్యపడి భూలోకమునకుపోయి పురూరవుని సౌందర్యము కండ్లారచూచివచ్చుటకు నిశ్చయించిరి. వారుపోవుసరికి పురూరవుడు అంతిపురమున అభ్యంగస్నానము చేయుచుండెను. అప్పుడు వారు వాకిటనుండు ప్రతీహారులవలన తమరాక చక్రవర్తికి ఎఱింగింపగా నాతడు స్నానకృత్యము గావించిన పిమ్మట వారికి దర్శనమీయగలనని చెప్పిపంపెను. కాని అశ్వినీదేవతలు అప్పుడే ఆతనిని చూడవలయునని పట్టుపట్టిరి. అగుట రాజునకు దర్శనమీయకతప్పినదికాదు. అప్పుడు వారు రాజుసౌందర్యమును చూచిఅబ్బురపడిరి. స్నానానంతరము కూడతిరిగి చూడగోరిరి. స్నానాలంకారాద్యనంతరము అశ్వినీదేవతులు తిరిగి యొకసారి రాజును చూచిరి. కాని అంతక్రితముండిన అందము ఇప్పుడు లేకుండెను. ఏమన మానవదేహము శీఘ్రపరిణామి. అంతలో ముసలితనపుగుర్తులు ముంచుకొనివచ్చును. శాశ్వతమగు దేవలోక సౌందర్యమునకును దీనికిని సాటియెక్కడ? మానవ సౌందర్యము కాలమువలన ఇంతలో మార్పునొందుననను సత్యమును బోధించునేకాని ఈ కథ అభ్యంగస్నానము సౌందర్యనాశకమను విపరీతసిద్ధాంతమును చేయునదికాదు.

# కారపుశనగలు

కొత్తవైస్రాయిగారు వచ్చీరావడములో తమదృష్టిని ఐ.సి.యస్ ఉద్యోగులమీద, అచ్చోసిన ఆంబోతులమీద ప్రసరించారు. చూసి చూసి ఆ ఐ.సి.యస్లను, ఆ ఆంబోతులను పల్లెలమీదకు పంపించడానికి వారు నిశ్చయించినారు.

... ... ...

తెనాలిలో నాలుగువందలవ్యభిచారగృహములున్నాయట. కాబట్టే దానికి తెనుగుదేశపు పారిస్ అనే గొప్పపేరు వచ్చింది. ఈపేరు పోవడానికి ఇపుడు ఈగృహాల్ని నిర్మూలించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

... ... ...

శారదాయాక్టువల్ల ఆంధ్రదేశాన బ్రిటీష్ ప్రభుత్వంవారికి రెండునష్టాలు కలిగాయి. ఒకటి : బ్రిటీష్ ఆంధ్రభాగంలో సనాతనులు దినవారాలేకాని పెళ్ళిళ్లుచెయ్యడం మానడం. వారి పెళ్ళిళ్ళన్నీ ఫ్రెంచియానాం, ఫ్రెంచిపేటలందే జరుగుతున్నాయి. రెండు. ఫ్రెంచిపేటమీద బ్రిటీష్‌వారికి అధికారంలేదనే వాదం విషయంలో ఆంధ్రసనాతనులు ఫ్రెంచివారి పక్షం వహించడం.

... ... ...

ద్రౌపదీమానసంరక్షణ టాకీయందు దుర్యోధనపాత్రధరించిన రాఘవాచారిగారు తాము సినీమాయందు నటించిన కారణమును 'యుగవాణి' యందు నివేదిస్తూ 'నటుడు రసానుభూతి పొందుచుండెనా, లేక ఊరక నటించుచుండెనా? అనునది ముఖ్యప్రశ్న' అన్నారు. ఇతరపాత్రలు ఏవీ పుచ్చుకోక వారు దుర్యోధనపాత్ర పుచ్చుకోవడంతోటే ఇంది రసానుభూతికోఅకేరా బాబు అని నావంటివాళ్లు చాలామంది అనుకున్నారు. పక్కను భానుమతి వేషధారిణి ఉందిగా.

... ... ...

'ఆదర్శరహితములైన నాటక ప్రదర్శనములలోనే నింక పాల్గొననని తీర్మానించుకొనినాను' అని ఆ చార్లుగారు అంటున్నారు. ఈ ఉద్దేశము ఒకటిరెండుసార్లు మానసంరక్షణంఆటమధ్యనుకూడా కలిగిందికాబోలు ఫిలుము తీయబడుచుండగా వారు స్వగ్రామానికి తిరిగివస్తూవుండడం ఫిలింయజమానులు బుజ్జగించి తీసుకువెళుతూండడం జరిగినట్లు విన్నాను.

... ... ...

గతసారి ఆంధ్రయూనివర్సిటి వైస్‌ఛాన్సెలరుగా ఉండగా కట్టమంచి రామలింగారెడ్డిగారు ఎన్ని పుస్తకాలికి పీఠికలు వ్రాశారు? ఈపీఠికలు అన్నీ ప్రత్యేకం ఒక గ్రంథంగా అచ్చువేస్తే వారిస్వతంత్రగ్రంథములకంటె ఎన్నిరెట్లు పెద్దగ్రంథం కాగలదు? ఆంధ్రపోస్టుగ్రాడ్యుయేట్లు తేల్చాలి.

... ... ...

గోలకొండపత్రిక ఇట్లు ప్రచురించుచున్నది : సంతానోత్పత్తికి స్త్రీపురుషు లిరువురు ఉండవలెనని సిద్ధాంతములేదనియు, స్త్రీ స్త్రీవల్ల సంతానమును కనవచ్చుననియు అమెరికాయందలి హార్వర్డు యూనివర్సిటీ ప్రొఫెసరు డాక్టర్ గ్రిగరీ పింకస్‌న్‌గారు కనుగొన్నారు. అయితే ఈవిధముగ ఎంతదూరము పరీక్షించినను స్త్రీవల్ల స్త్రీకి ఆడుపిల్లలే పుడుతున్నారు కాని మగపిల్లలు పుట్టలేదు. స్త్రీవల్ల స్త్రీకి స్త్రీశిశువులేగాని మగపిల్లలు పుట్టకపోతే పోనీ మగవాడివల్ల మగవాడు మగపిల్లల్నికనే పరిశోధన సాగింపవచ్చునుగా? ఇంతకూ సంతానోత్పత్తికి స్త్రీపురుషజాతి అవసరంలేనపుడు ఏదో ఒకజాతి అభివృద్ధి పొందితేమాత్రం చాలదు కనకనా?

మరిన్నీ ఈకొత్తపరిశోధనవల్ల ఒక స్త్రీ తనకడుపును మరో స్త్రీకి ట్రాన్సఫరుచేయడానికి వీళ్లు కనబడ్డాయి. దీనిమూలంగా 'ఆంధ్రభూమి'లో బి. వెంకటలక్ష్మమ్మగారు స్త్రీలకు కావాలని కోరే గర్భస్రావపుహక్కుయొక్క అవశ్యకతలేకుండా పోతోంది. ఏమంటారా? రహస్యంగా కడుపుఆయిన స్త్రీ తన కడుపును దింపించుకోడానికి బదులు సంతానంకోసం వలపలాడే మగనాలికి తనకడుపు ట్రాన్సఫరు చేయవచ్చు. కాబట్టి వెంకటలక్ష్మమ్మగారు ఇంకమీద గర్భస్రావపు హక్కుకు ప్రయత్నించక పై డాక్టరుగారికి వ్రాసి వారి పరిశోధనాఫలితములను ఈదేశపు రహస్యపు స్త్రీలకు వెల్లడిపఱుతురుగాక అని కోరుచున్నాను.

... ... ...

కుక్కను గ్రామసింహము అన్నట్లే పందిని గ్రామగజమనవచ్చునని ఒకమిత్రు డన్నాడు. ఒకానొక తెనుగుకవి పందిని వర్ణిస్తూ దాన్ని తొండములేని భద్రకరి అన్నాడు. ఈనడుమ గుమ్మలూరులో పంది కడుపున తొండముతో ఉన్న పిల్లపుట్టింది. పందిని తొండములేని భద్రకరి అన్న కవివాక్యం ఇందుతో పొల్లుపోయింది; దాన్ని గ్రామగజమన్న మిత్రుడి వాక్యం నిజం అయింది.

... ... ...

ద్రౌపదీవస్త్రాపహరణము, ద్రౌపదీమానసంరక్షణము—రెండు తెనుగుటాకీలు: వస్త్రాపహరణము ముందైంది. వస్త్రాపహరణం అయింతరవాత ఇక మానసంరక్షణకు ఆస్కారంలేదు కాబట్టి మానసంరక్షణాన్ని చేస్తామన్నా చాలామంది నమ్మకంగా చూడ్డం మానేశారు.

... ... ...

నెల్లూరు పోస్టాఫీసునందు స్టాంపులుఅమ్మేగది గాలివెలుతురులేని గొందిఅనీ, స్టాంపులు కొనుక్కునేవారు అవి అందుకోడానికి తలవంపులతో తంటాలు పడాలనీ ఒకరు సుబోధిని పత్రికయందు వ్రాస్తున్నారు. మరి నెల్లూరు రైలుస్టేషన్ మాత్రం ఎల్లా వుంది? ప్లాటుఫారంకంటె పల్లంలోవుండే స్టేషన్ మరి తెనుగుదేశంలో ఎక్కడేనా ఉందా? నెల్లూరు విక్రమసింహపురం కాబట్టి అచ్చటి విక్రమసింహాలికి ఈరెండు గుహాలూ వుండితీరాలి.

—వి. విశ్వనాథము, బి. ఏ.

# ఆంధ్ర రాజధాని నిర్ణయ చర్చ

రాష్ట్రసిద్ధియైనపిమ్మటనే రాజధాని నగరవిషయము సర్వజన సమ్మతముగా పరిష్కరించుకొనగలము కావున ఆంధ్రరాజధాని నగర విషయకమైన చర్చను మానుడని కొందఱు విజయనగర ప్రముఖులు మాకు వ్రాయుచున్నారు. రాజధాని నిర్ణయింపబడిన గాని రాష్ట్రసిద్ధికి అనుకూలవాతావరణము ఏర్పడదను విషయము జ్ఞప్తియందుంచుకొనవలెను. రాయలసీమవారిని కూడగట్టుకొనుటకు ఈసమస్య ముందు తేల్చవలెను. తేల్చువఱకు రాయలసీమవారు మనతో కలిసి రానేరారు. రాయలసీమ కలిసిరానిది రాష్ట్రసిద్ధి కలలో వార్త. కావున ఈచర్చ సాగింగకుండవలెనను వాదముతో మేము యేకీభవింపలేకుండనున్నాము. అగుట ఈవిషయమై మాకార్యాలయమునకు వచ్చిన అభిప్రాయములను పై మాసపు సంచికలో ప్రచురించుటకే నిశ్చయించితిమి.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

### ౧౭౯–౧౮౦. ధాతుసంవత్సరపంచాంగములు.

బెజవాడయందలి మృత్యుంజయఫార్మసీవారియు, ఆంధ్రప్రావిడెంటుకంపెనీవారియు ధాతుసంవత్సరపు గంటల పంచాంగములను కృతజ్ఞతాపూర్వకముగ నందుకొంటిమని మనవి. ఈరెండు పంచాంగములును జేబునందిముడు చిన్నసైజున ముద్రింపబడి అనేకములగు ఉపయుక్తాంశములతో నొప్పుచున్నవి.

### ౧౮౧. కూలోడా ?

కూలివాని కష్టములను వివరించు గేయముల చిన్న పుస్తకము. రచయితలు : వాసిరెడ్డి నాగేశ్వరరావు, గద్దె లింగయ్యగార్లు. ప్రకాశకులు : లేబర్ ప్రొటెక్షన్ లీగ్, ఏలూరు.

### ౧౮౨. వయోజనవిద్య

ఆంధ్రపత్రికాపాఠకులకు చిరపరిచితులయిన శనివారపు సుబ్బారావుగారు రచియించినది. ఇందు గ్రంథాలయములద్వారా వయోజనవిద్యావ్యాపనము చేయతగు తెఱగులు ప్రస్తరింపజడినవి. చదువువచ్చినవారికెల్ల ఇపుడు వోటుహక్కు ప్రసాదింపబడియున్నది. అగుట వయోజనవిద్యావ్యాప్తితో వోటర్లు హెచ్చి హెచ్చుమంది ప్రభుత్వపరిపాలనలో జోక్యము కలుగజేసికొనుటకు అనువుండును. గ్రంథాలయములు దీనివిషయమున శ్రద్ధవహించుట దేశహితకరమైనది. దీనిని ప్రచురించిన వేటపాలెం సరస్వతీనికేతనమువారు ఎంతయు స్తుతింపదగినవారు.

### ౧౮౩. ఆంధ్రపుష్పబాణవిలాసము

శృంగారరస భూయిష్ఠమగు పుష్పబాణవిలాసమను ఇరువదియారు శ్లోకముల సంస్కృత కావ్యమునకు వేంకటపండితరాయ సార్వభౌముడు చేసిన శృంగార చంద్రికా వ్యాఖ్య ననుసరించి దేవగుప్తాపు వేంకటరమణ కవిగారు కావించిన ఆంధ్రానువాదము. ఆంధ్రీకరణము మూలానుసారముగ నుండి పండితుల సదభిప్రాయమును చూఱగొన్నది. వెల మూడు అణాలు. దొరకుచోటు : డి. వి. రమణకవిగారు, కరణము, వెంపడాం - పి. ఓ. పోస్టు, (వయా) నెల్లిమర్ల.

### ౧౮౪. శారీరశాస్త్రము

రిజిస్టర్డు ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్ అయిన డాక్టర్ పురాణపండ రామమూర్తిగారు రచియించినది. తెనుగువచనము. గర్భ, శరీర, అంగవిభాగ, త్వక్, కలా, ఆశయ ప్రకరణములు ఆయుర్వేద వైద్య సంప్రదాయపు శారీరశాస్త్రమున ఇది మొదటిభాగము. క్రౌనుసైజున 64 పుటలు. వెల పదిఅణాలు. దొరుకుచోటు: సంపాదకుడు, భరద్వాజాయుర్వేద గ్రంథమాల. కాకరపర్రు, పశ్చిమ గోదావరి జిల్లా.

### ౧౮౫. రాజధర్మప్రకాశికా

'ప్రాచీనహైందవ నీతిధర్మశాస్త్రములలోనుండెడి పద్ధతుల ననుసరించియు ప్రస్తుతరాజకీయమగు హిందూలా పరిస్థితుల బాగుగ విమర్శించియు' అమ్మపాలెం జమీందారులగు కొల్లూరు జోగారాయ దీక్షితులుగారు సంస్కృతభాషలో రచియించిన గ్రంథము. క్రిమినల్, సివిల్, రెవిన్యూ అను మూడు భాగములందు ప్రస్తుతము క్రిమినల్ భాగము ప్రచురింపబడినది. ఆంధ్రభాషయందు వివరణముకూడ చేర్పబడియుండుట పుస్తకమునకు హెచ్చుప్రయోజనము కలిగినది. క్రౌనుసైజున 286 పుటలు. వెల రెండు రూపాయిలు, వలయువారు కొండపల్లి గోపాలరావు దేశముఖ్, అనిశెట్టిపల్లి, భద్రాచలంరోడ్డు రైల్వే

స్టేషన్. ఈగ్రంథముద్రణము శతావధాని శ్రీయుత హరి రామలింగశాస్త్రిగారి ప్రజ్ఞాపరిశీలనమున జరిగినది.

### ౧౮౫. బౌద్ధమహాయుగము

హిందూదేశకథయందు బౌద్ధమహాయుగపు చరిత్ర అంతయు ఈగ్రంథమున విస్తరింపబడినది. 'భారతేతిహాసమునందు బౌద్ధ మహాయుగము అత్యంత తేజోమయమగు అశ్వాసము.' అఆశ్వాసమును ఈ గ్రంథమున శ్రీయుత వేలూరి సత్యనారాయణగారు, బి. ఏ., మనోహరముగ ప్రస్తరించిరి. విషయ వివరణము దేశభక్తిని ఉద్దీపింప జేయునదిగను, చేర్పబడిన చిత్రములు నాటి భారతకీర్తిని ప్రస్ఫుటము చేయునవిగను ఉన్నవి. ప్రతియాంధ్రుడును తప్పక చదువదగిన ఉత్తమ గ్రంథములయందు ఇదియొకటి. ఆంధ్ర గ్రంథాలయములకు అలంకారప్రాయమగు గ్రంథము. క్రౌనుసైజున 450 పుటలు. వెల రూ. 2-4-0. వలయువారు గ్రంథకర్తపేర పశ్చిమగోదావరిజిల్లా భీమవరమునకు వ్రాయునది.

### ౧౮౬-౧౮౭. చైనాజాతీయోద్యమము.

ఒకటి, రెండు భాగములు. సుప్రసిద్ధ రాజకీయ నాయకులును, ప్రఖ్యాతాంధ్ర గ్రంథ రచయితలును అగు శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఈ గ్రంథకర్తలగుట వీని ప్రాశస్త్యమును ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. వీరు ఇదివఱకు వ్రాసియున్న ఫ్రెంచి స్వాతంత్ర్య విజయము, తురుష్క ప్రజాస్వామికములవలెనే ఈ పుస్తకముగూడ అపూర్వమగు చారిత్రకవిజ్ఞానమును విరజిమ్ముచున్నది. ప్రథమాధ్యాయమున ప్రాచీన చైనాదేశపుచరిత్ర సింహావలోకనము చేయబడినది. చైనాస్వతంత్రోద్యమనాయకుడగు డాక్టర్ సన్‌యటుసేనును గూర్చిన చతుర్థాధ్యాయము చదువుచుండ ఒడలు పులకరించును. తొమ్మిదవ అధ్యాయమున వర్ణింపబడిన మంచుకో రాజ్యస్థాపనము చదివినచో జపానువారి సామ్రాజ్యకాంక్ష పట్టుచున్న వక్రగతులన్నియు స్పష్టమగును. చీనాదేశమందలి యువజనోద్యమమును వర్ణించు పదకొండవ అధ్యాయము మన యువకులందరును ముఖ్యముగ చదువతగినది. ఒక్కొక్కభాగము క్రౌనుసైజున రెండేసివందల పుటలు. ఒక్కొక్కప్రతి వెల రూ 1-0-0. దొరుకుచోటు : భారతీనికేతనము, కాకినాడ.

### ౧౮౮. ఆరోగ్యదర్పణము

శాస్త్రీయములును, అనుభవసిద్ధములును అగు పెక్కు వంట, ఖజ్జలి ఔషధములు, ద్రావకములు, ఆసవములు, అరిష్టములు, చూర్ణములు, మాత్రలు, తైలములు, లేహ్యములు- మొదలగు మందులు స్వల్పక్రయమునకు అమ్ముచు ఆంధ్రదేశమున విశేషవ్యాపారము చేయుచున్న నెల్లూరుజిల్లా పెరిదేపియందలి పి. శి. ఏ అండు కంపెనీవారు ప్రచురించిన గ్రంథము. కంపెనీ ప్రొప్రయిటరులగు ఆయుర్వేద విద్వాన్, భిషగ్వర, పి. శి. అయ్యవారప్పయ్యగారు దీనిని రచియించిరి. ఆరోగ్యమార్గములు అందఱికి తెలియులాగున ఇందు తేలికశైలియందు వివరింపబడినవి. స్వస్థవృత్తమును బోధించుచున్న ఇది సకలజనులచే చదువబడదగినది. పుస్తకము 1-కి 0-6-0.

### ౧౮౯. శ్రీవెంకటేశ్వర వడ్డీజంత్రి

కొఆపరేటివు క్రెడిట్ సొసైటీలకును, వడ్డీవ్యాపారముచేయు షాహుకార్లకును ఉపయోగమగునట్లు డోకారాలతోకూడ వేసిన వడ్డీజంత్రి. ఇంతకుముందు వెలువడిన వడ్డీజంత్రీలకు అన్నిటికంటె ఇది మిన్నగనున్నది. రాయల్‌సైజున 114 పుటలు. అసలు వెల రూ 2-0-0. ఆంధ్రభూమి పాఠకులకు ఒక్క రూపాయిమాత్రమే. మాపాఠకులు ఈసదవకాశమును చేకొందురని నమ్మెదము. ప్రతులు దొరకుచోటు : గోపూడి వెంకయ్యచౌదరిగారు, గుండుగొలను, ఏలూరు తాలూకా. పశ్చిమగోదావరి జిల్లా.

---

Printed at The Andhrabhumi Printing works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.